# మాస్టర్ గారి సత్సంగము

## ప్రవచనములు



సదా నింబవృక్షస్య మూలాధివాసాత్ సుధా స్రావిణం తిక్తమప్య ప్రియంతమ్ ॥
తరుం కల్పవృక్షాధికం సాధయంతం నమామీశ్వరం సద్గురుం సాయినాథమ్ ॥


ప్రచురణ

**ఆచార్య భరద్వాజ సేవా సంస్థ**

సూళ్ళూరుపేట.

**MASTER GARI SATSANGAM**

**MARCH 12th 2001.**

ప్రతులు : 2000

మూల్యం : శ్రద్ధ, సబూరి

ముద్రణ : కళాచిత్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్
సూళ్ళూరు పేట,
నెల్లూరు జిల్లా.

ప్రతులకు

**శిరిడి సాయి సత్సంగము**
చిత్రకూటం
సూళ్ళూరుపేట - 524 121.

## శ్రీ సాయి ధర్మ ప్రచార యజ్ఞానికి సహకరించండి

**సాయిబాబా (మాసపత్రిక)**

**శ్రీ ఆచార్య భరద్వాజ** గారు దశాబ్దాలు శ్రమించి సేకరించిన సాయిలీలలు, జీవిత విశేషాలు, అనేకమంది మహాత్ముల చరిత్రలు ధారావాహికంగా భక్తులకు అందిస్తున్న ఏకైక తెలుగు మాసపత్రిక చదవండి. మీ అనుభవాలు వ్రాసి పంపండి. సాటివారి చేత చదివించి వారిని చందాదారులుగా చేర్పించి ఈ ధర్మప్రచార యజ్ఞంలో సహకరించ ప్రార్థన. సంవత్సర చందా 100/-రూ. లు. జీవిత సభ్యత్వము రూ. 1116/- లు (పదినెలసరి వాయిదాలుగా పంపవచ్చు). జీవిత సభ్యులకు ఉచితముగా సాయిబాబా జీవితచరిత్ర లేక గురుచరిత్ర పంపబడుతుంది. రూ. 3000/- లు చెల్లించిన రాజపోషకులకు శ్రీ ఆచార్య భరద్వాజగారు రచించిన తెలుగు ఆధ్యాత్మిక గ్రంధాలు ఒక సెట్టు ఉచితముగా బహూకరించబడును.

వివరములకు

**శ్రీ మాస్టర్ యూనివర్సల్ సాయి ట్రస్టు**

యం.యం. డొంక, ఒంగోలు - 523 002.

## విన్నపము

ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారు 12 సంవత్సరములు తపమాచరించిన యింటిని విద్యానగరు గురుబంధువులు **గురు భరధ్వాజ తపోవనం** గా తీర్చిదిద్దుతున్నారు. ఆ యింటి నుంచే మాస్టరు గారు **సత్సంగ - ప్రవచనాల** ద్వారా సాయిధర్మ ప్రచారానికై శ్రీకారం చుట్టినారు. అందుకనే అనేకమంది మహాత్ములు ఆ యింటిని తమ పాదస్పర్శ తో పునీతం చేసినారు. ఆ తపోవనాన్ని కాపాడుకోవడం మన తక్షణ కర్తవ్యము, ధర్మం కూడా. ఆ తపోవనానికి మనమందరం కంచెగా ఏర్పడి మనము, మనసాటి గురు బంధువులందరి చేత యధాశక్తి ఆర్థిక సహాయందించి గురుకృపకు పాత్రులగుదాము.

**దక్షిణ పంపదల్చుకొన్న వారికి చిరునామా**

**శ్రీ గురుభరద్వాజ తపోవన కమిటీ**

**విద్యానగరు, కోటమండలం**

**నెల్లూరు జిల్లా - 524 413**

**ఈ పుస్తక ముద్రణకు ఆర్థిక సహాయమందించిన గురుబంధువులు**

| | | |
|---|---|---|
| ఆచార్య భరధ్వాజ సేవాసంస్థ సభ్యులు | సూళ్ళూరు పేట | 4500-00 రూ. |
| శ్రీ G. సుకుమార్ | నాయుడుపేట | 2000-00 రూ. |
| శ్రీ సాయి భక్తురాలు | సూళ్లూరుపేట | 1478-00 రూ. |
| శ్రీ A. ప్రహ్లాదయ్య | గూడూరు | 1000-00 రూ. |
| శ్రీ సాయి భక్తుడు | సూళ్లూరుపేట | 1000-00 రూ. |



# ముందుమాట

మానవ శ్రేయోజీవన విధానానికి అనేక రంగాల్లో ఎందరో మహాత్ములు, అవతార పురుషులు కృషిచేసినారు, చేస్తున్నారు. వారిలో శ్రీరామ, శ్రీకృష్ణ అవతారాలు మొదలుకొని, క్రీస్తు, మహమ్మదు, గురునానక్, కబీరు, ఆదిశంకరాచార్యులు, రమణ మహర్షి, రామకృష్ణపరమహంస, శిరిడి సాయిబాబా మున్నగు మహాత్ములు. వీరి ఆచరణ సందేశాల ద్వారా మానవ జీవిత విధానానికి ధర్మమార్గం తెలుసుకోగల్గుతున్నారు. అట్టివారికి వారసులుగా ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారు తన రచనల ద్వారా ఆదర్శ, ఉపదేశాత్మకులుగా వెలుగొందారు. వారు, వీరనేల అందరు ఆచరించ, ఆనందించదగిన శ్రేయోమార్గం వీరి రచనల ద్వారా మనకు లభిస్తుంది. వారు ఏం చేశారో! అదే చెప్పారు. ఏం చెప్పారో! అదే చేశారు. అది మాస్టరు గారి గొప్పతనం.

మాస్టరుగారు సాయిధర్మ ప్రచారానికి 'సత్సంగాన్ని' ఆయుధంగా చేపట్టారు. మూలకేంద్రంగా పల్లెప్రాంతమైన విద్యానగరు ను ఎన్నుకొన్నారు. (సాయినాధులు చిన్నపల్లె అయిన శిరిడిని ఎన్నుకొన్నట్లు) ఇచటనుండే సత్సంగాలు ప్రారంభమైనవి. అందుకే మనకీనాడు విద్యానగరు గురుస్థానం లాంటిది. ఈ స్థానంనుంచే పుట్టినవి, ఏదినిజం, నిజానికి నిచ్చెనలు, మతం ఎందుకు?, విజ్ఞాన వీచికలు, సాయిబాబా చరిత్ర మున్నగునవి. గ్రంథాలు చాలా విధంగా ఉంటాయి. ఆ గ్రంథం ఎలా పుట్టిందో ఆలోచిస్తే తప్ప ఆ గ్రంథం ప్రయోజనం అర్థం కాదు.

విశ్వచైతన్యమే దత్తరూపం ధరించింది. ఆ విశ్వ చైతన్యమే కాలానుగుణంగా మానవ కల్యాణార్థమై శ్రీ మాస్టరుగారి రూపం ధరించింది. ఎన్నో సంవత్సరాలుగా ఇంతగొప్ప మహనీయుని నోటిగుండా వెలువడిన వాక్యాలను మనం స్మరించి, ఆచరించి తరించాలనే సంకల్పంతోనే ఈ చిన్ని పుస్తకం మీకందించాము. 1976 సం॥ నుండి ఆ మహనీయుని సత్సంగం విన్న పుణ్యాత్ముడు ముఖ్యమైన విషయాలు వ్రాసుకొని శ్రీమాస్టరు గారికి చూపినట్లుంది. వారు ఆ వ్రాతలను సరిదిద్ది "తనకొక కాపీ వ్రాసి ఇవ్వమన్నట్లుంది". ప్రస్తుతం ఆ కాగితాల కట్ట విద్యానగరు మందిర ఆఫీసు బీరువాలో దొరికింది. ఇందలి పదజాలము, బాషానైపుణ్యము, మాట తీరులేగాక చివరిలోని భద్రాచలం అడవులలోని వృత్తాంతాన్ని బట్టి ఈ పేపర్లన్నీ శ్రీ మాస్టరుగారు దిద్దినారని రూఢీ అవుతుంది.

ఈ పుస్తకం మాస్టరుగారి అనుగ్రహాన్ని పొందిన రచన కాబట్టి గురువుగారి అనుగ్రహం పొందదలచిన వారు చదవదగినది. ఈ పుస్తక ముద్రణకు ప్రేరేపించిన శ్రీ పెసల సుబ్బరామయ్యగారికి కృతజ్ఞతలు తెలియచేస్తూ, ప్రతిమాట పూజా పుష్పంగా భావించి, అర్పించి, ఆచార్యుల సన్నిధిలో ఆ అమృతాన్ని అనుభవించి, ఆచరించి, తరిద్దాము.

ఈ పుస్తకం పఠించిన గురుబంధువులలో కొందరైనా ఇవి ఆచరించడానికి ప్రయత్నిస్తే మా కృషి సఫలమైనట్లే.

సాయి - మాస్టర్ సేవలో
**శిరిడి సాయి సత్సంగము**
చిత్రకూటం, సూళ్ళూరుపేట.



# ప్రవచనములు

ఉపనిషత్తులు, పురాణాలు, ధర్మశాస్త్రాలన్నీ కూడా ఋషుల నోటినుండి వచ్చిన వాక్యాలు. అవి భగవంతుని వాక్యాలతో సమానం . వాటి అర్థం మనకు తెలియాలంటే వాటిని పరిపూర్ణంగా ఆచరించిన వారే చెప్పగల సమర్థులు. ఈ కోవకు చెందినవారే మన మాస్టరుగారు. ఆచార్యుల వారి నుండి వెలువడిన ఈ ప్రవచన వాక్యాలు విని, మననం చేస్తే సంపూర్ణమైన ఆధ్యాత్మ బోధ మనకు లభిస్తుంది.

**21-1-76**

1. ఆత్మను తెలుసుకొనుటకు మార్గము (నేరుగా 'నేను' మీద ధ్యానించలేకపోతే)
   ఎ) అన్నమయ కోశము
   బి) మనోమయ కోశము
   సి) ప్రాణమయ కోశము
   డి) విజ్ఞానమయ కోశము
   ఇ) ఆనందమయ కోశము. ఇవేవి తాను కాదని తెలుసుకోవాలి. ఆత్మమీద మనస్సు నిలిపి ధ్యానించుట.
2. సత్వగుణము పెంచుకుంటూవుంటే మనోబలం లభించ గలదు.

**28-1-76**

1. కనీసం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మన నిశ్చయం (జీవిత లక్ష్యము) గుర్తుకురావాలి.
2. ప్రపంచంలో తక్కిన జీవకోటికన్న మానవ జన్మ యొక్క ప్రాధాన్యతను గుర్తించి, అవకాశములను, సమయమును వృధా చేసుకోవటం ఎంత ప్రమాదకరమో గుర్తించి సద్వినియోగ పరచుకోవాలి.

3. కాలేజి గాని, ఇల్లుగాని వదలి పోయేటప్పుడు, తిరిగి వచ్చునపుడు జీవులన్నింటిని బాబా రూపాలుగా గుర్తించాలి.
4. వివేక వైరాగ్యాలతో తన జీవిత లక్ష్యానికి అడ్డువచ్చే ప్రతి పనిని తొలగించుకుంటూ తన లక్ష్యముపై యావత్ శక్తిని ఉపయోగించాలి. అవసరమైతే ఆ క్రియలో ప్రాణత్యాగమైనా చేయాలి.
5. ధ్యానం పూర్తయ్యాక లౌకిక విషయాలలో మన ప్రవర్తనలోను మన లక్ష్యం మరచి పోకుండా చూచుకోవాలి. తన దిన ప్రవర్తనలో తప్పటడుగు వేసిన ప్రతిక్షణము తాను అధోగతి పాలౌతున్నట్లు తలచి నిర్మూలించాలి. దినంలో ప్రతి క్షణాన్ని పెట్టుకున్న లక్ష్య సాధనలో వినియోగించాలి. దాని కొరకు మనకు గల చాపల్యాలను బలవంతంగానైనా నశింపచేయాలి. ఇవి నశించనంత వరకు మనస్సు ధ్యానానికి ఉన్ముఖత పొందదు.
6. మృత్యువు తప్పదు అన్న విషయాన్ని తీవ్రంగా గుర్తుంచుకొంటే మనస్సు చెడ్డదారిన పడదు.
7. శరీరం నిలవడం కోసమే అన్నం తినాలి.

**11-2-76**

1. బంధుజనులు, లౌకిక సుఖాలు జ్ఞాపకం వస్తే సావధానంగా ఆలోచించి నిర్మూలించాలి.
2. ఎవరు పెట్టినదల్లా ఊరికే తినకూడదు.
3. ధ్యానం బాగా చేస్తే ఇంకా బాగా చేయాలనిపిస్తుంది. 10 నిమిషాలు చేసి చీమిడి తీసివేసినట్లు లేచిపోవడం కాదు.
4. లౌకిక విషయాల్లో సమయం వృథాకాకూడదు.
5. యోగ్యతను తెచ్చుకోవాలి (Jesus)



6. ముక్తిమార్గంలో పడదగిన కష్టాలు తెలుసుకోవాలంటే "మిలారేపా" చరిత్ర చదవాలి.

**13-2-76**

1. లౌకికత మనస్సులోకి రాగానే తీవ్రంగా యోచించి సావధానంగా మరియు ఉత్సాహంగా నశింప చేయాలి.
2. వాయిదా వేస్తూ, కాలక్షేపం చేస్తూ, తప్పుడు భావాలను మనస్సు లోనికి రానీయకూడదు.
3. ప్రపంచం గురించి, అందులోని అశాంతి, దుఃఖాలను పద్ధతిగా యోచిస్తే సాధనపై అఖండమైన శ్రద్ధ కలుగుతుంది.

**17-4-76**

1. ప్రాపంచిక విషయాలన్నీ దుఃఖాన్నే యిస్తాయి. అన్నీ దుఃఖాంతాలే ఈ మాట చాలా అవసరం. లాభాలు నష్ట రూపంలోను, భవనాలు శిథిలం కావడంలోను, పుట్టుక చావును, అంతంలోను యిస్తాయి.
2. దినచర్యలో ఎల్లపుడు తాను పరిమితుడను. కానని గుర్తిస్తూ ప్రవర్తించాలి.
3. జీవితంలో ఎప్పుడు కూడా తనకు తప్పు అనిపించే పనిచేయకూడదు.

**10-6-76**

1. మానసిక బలహీనతలన్నీ ధ్యానంలో మనస్సును ఇంకా లయం చేయాలని చెబుతాయి. బలహీనతలను గమనిస్తూ యింకా బాగా సాధన చేస్తూ రావాలి.
2. ముక్తిని పొందకపోతే మరలా జనన మరణాలలో

చిక్కుకుంటావు. సాధన చేయకుండా ఎన్ని సంవత్సరాలు గడిపావు? ఈ మాటలు వినికూడా ఏమి చేస్తున్నావు? నీవు చేసిన పాపాలన్నీ నిన్ను హతమారుస్తాయి అని హెచ్చరించుకుంటూ ఉండాలి.

3. ఆధ్యాత్మిక సాధనలో అన్ని లౌకిక విషయాలను త్యజించాలి.

**22-6-76**

1. యవ్వనము, వనము ఒకే విధమైనవి. వనంలో దారి తప్పినట్లే, జీవితంలో తప్పటడుగు వేస్తాం.
2. మనం అంటే దేహం అని అనుకుంటున్నంత కాలం మహాత్ముణ్ణి ఒకప్పుడు జీవించినవాడనే భావం పోదు.
3. 'నేనుదేహము' అనే భావము లౌకిక విషయాలనే సువర్ణభాండాన్ని అపురూపంగా రక్షిస్తూవుంటుంది.
4. గురువుకంటే అధికమైనదేదీలేదని శాస్త్రాలు చెబుతాయి.
5. నేనుదేహము అనే భావము మానవత్వము.
6. సర్వవ్యాపిలో విష్ణు చక్రము, దాని మధ్యన పండరి క్షేత్రము కనిపించే జగత్తు. దాని మధ్యలో బిందు తీర్థము, చూపును గుర్తించే కేంద్రము తీర్థములోని నెలవంక ('ఓం' లోని చివరి అర్థము మాత్రమే) ను సృష్టించెను.
7. గుడ్డ నేసేటప్పుడు దానిలోని నిలువుదారాలు మునులు, దేవతలు, అడ్డంగా ఉన్న దారాలు పంచభూతాలు (జీవకోటి) అందువలన ప్రతివాడికి ఒక గోత్రము ఉంటుంది. (మునిపేరు)

**28-6-76**

1. ఆధ్యాత్మిక మార్గంలో శక్తినంతా వినియోగించి కృషి చేస్తే గాని ఫలితం ఉండదు.



2. సన్యాసికి కష్టాలలో భయం ఉండకూడదు.
3. వసతి గృహంలో దొంగలున్నారు. ద్వారాలన్నీ బంధించి జాగ్రత్తగా ఉండు. దొంగలు సర్వము దోచుకొని పోగలరు.
4. His master Voice వారి రికార్డు ఎంబ్లమ్ లోని కుక్క మైక్‌లో వినబడే తన యజమాని కంఠమును నిశ్చలంగా శ్రద్ధగా కూర్చుని వింటుంది. అలాగే మనం కూడా ధ్యానంలో కదలకుండా కూర్చోవాలి.

**29-6-76**

1. ప్రథమంగా అచంచలమైన వైరాగ్యం తెచ్చుకోవాలి.
2. అనవసరంగా ఎవరితోనూ కాలక్షేపం చేయకూడదు. అనవసరపు విషయాలను ఆలోచించి కోరికలు తెచ్చుకోకూడదు.
3. ధ్యానాన్ని పెంచుకుంటూ లౌకిక విషయాలు త్రుంచి వేయాలి.
4. భగవద్భక్తి పై పిసినారిగా ఉండాలి.
5. ధ్యానానికై సమయాన్ని ప్రతి యితర పనులలో మిగుల్చుకుంటూ రావాలి.
6. ఎప్పటికప్పుడు బాబా మన ప్రక్కనే ఉన్నాడు అనే భావం జ్ఞప్తి ఉండాలి - అదే నామం.
7. ఎప్పటికప్పుడు ఇప్పుడే ధ్యానం పూర్తవ్వాలి (సమాధి స్థితి రావాలి) అన్న ఆతృతతో ధ్యానించాలి. కొన్ని రోజుల తరువాత యిట్లా చేయాలి, కొన్ని రోజుల తర్వాత ఇట్లా చేస్తాను అని ఊహలవల్ల బంధించుకోకూడదు.
8. సాయి సేవకై ఉపయోగించే పరికరాలను (అవయవాలను) పనికిరాని చాపల్యాలకు ఉపయోగించరాదు. వాటిని అపవిత్రము చేయరాదు.

9. అనవసరంగా చాపల్యం కలిగించే విషయాలకి మనస్సును వదలి ఎంతసేపు ఉంచితే అంతబలంగా దుష్ట తలంపులు నాటుకుంటాయి.

## 4-7-76

1. ధ్యానం పూర్తిగా కుదరనపుడు అంటే మనస్సు ధ్యానంలో నిమగ్నం కానపుడు మరింత పట్టుదలతో బలంతో ధ్యానం కుదిరేవరకు శ్రమించి వదలాలి. అంటే ధ్యానం కుదిరేవరకు వదలరాదు. అప్పుడే ధ్యానంలో పురోగతి ఉంటుంది.
   అలాచేస్తే కొన్నాళ్ళకు ధ్యానం కుదరని రోజంటూ ఉండక ప్రతిదినం చక్కగా కుదరగలదు.
   ధ్యానం చేసాక అప్పటికప్పుడు లేచిపోక కొంతసేపు ధ్యానపు శాంతిని అనుభవిస్తూ ఉండి తరువాత లౌకిక కలాపాలను యాంత్రికంగా చేస్తూ మనస్సు మాత్రం ధ్యానంలో నిమగ్నం చేయాలి. అలాచేస్తే ప్రతిసారి తాను చేసే ధ్యానం యింతకు మునపటి ధ్యానానికి పై మెట్టు అవుతుంది. లేకుంటే చేసే ధ్యానం వ్యర్థం. ఎన్ని దినాలకు ప్రయోజనం కనపడక ధ్యానం క్షీణిస్తుంది. లౌకిక విషయాలలో అనవసరంగా సమయాన్ని వ్యర్థం చేయరాదు.

## 5-7-76

1. అనుభవమయ్యేదంతా మాయ. అనుభవం కానిదే బ్రహ్మం. వాస్తవం కానిదే ఈ పంచేంద్రియాలకు అనుభవమౌతుంది.
2. సాక్షిని గుర్తించడం, మనస్సును చూడడం, ఇప్పుడును అనుభవించడం చివరి దశలో తెలిసే సాధనలు.
3. ఇప్పుడు సమస్య, సమాధానం లభించాయి. ఈ వసతి ఇంకరాదు.



4. మనస్సును ఆర్తిగా చూస్తే ఏదీ వినబడదు, కనపడదు.
5. యజ్ఞము:- య - దేనినైతే, జ్ఞ - తెలుసుకోవాలో అదే యజ్ఞము.
6. 'ఇదంతా బ్రహ్మము' అనే స్థితప్రజ్ఞను పొందితే కొన్ని సంవత్సరాలు ధ్యానంలో పయనించి ఉంటాడు.
7. శరీరంలోని చర్మం ప్రకృతి నుండి భిన్నుణ్ణి చేసేది కాదు. ప్రకృతితో గల ఐక్యత కలిగించేది.

## 8-7-76

1. ముక్తికి, దుఃఖానికి మనస్సే కారణం.
2. మనస్సంటే భావాల పరంపరలు. వీని నాశమే ఆనందము.
3. ఇంద్రియ విషయాలను ఆలోచిస్తే కోరిక కలుగుతుంది. వచ్చే ఆలోచనలు ఎక్కడనుండి వస్తున్నాయో చూస్తుండాలి. అప్పుడు మనోలయం అవుతుంది.
4. సాధన భుక్తికంటే ముఖ్యం. అందుకే ఇది పరమార్థం. భుక్తి తాత్కాలిక అవసరమే. సాధన జన్మకి అవసరం.

## 9-7-76

1. ఒక వస్తువు యొక్క లక్షణాలన్నీ ఒకేసారి గుర్తించగలిగితే ఆ వస్తువును సృష్టించగలడు.
2. అందరిలోను భగవంతుడే ఉంటే ఒకరిని ద్వేషించడం ఒకరిని ప్రేమించడం ఎలా? ఇదే ఆయనకు అన్యాయం చేయడమంటే.

## 10-7-76

1. సాధన చేయాలి అన్న బుద్ధి పుట్టక పోవడమే కర్మ ప్రారబ్ధం. దీనివల్ల మనస్సు సాధనకు ఉన్ముఖం కాదు.

2. మనస్సు ధ్యానానికి ఉన్ముఖంగా, ఉత్సాహంగా, అనుకూలంగా ఉంటే తీవ్రంగా చేయాలి.

3. మనస్సు చెడ్డ తలంపులతో ఉన్నప్పుడు ఎక్కువ బలవంతంగా ధ్యానం సాగాలి. వాడికే ముక్తి సాధ్యం.

4. ముక్తి పొందడం తెలియక ఈ లౌకిక విషయాలనే పులిస్తారాకుల గుంటలలో జీవిస్తున్నాము.

5. ధ్యానం నుండి లేచిపోవాలన్న భావాన్ని వివేకంతో ఆలోచించి తొలగించుకుంటే గురుకృప వస్తుంది.

6. ముక్తి పొంది తీరాలన్న కోరిక ధ్యానం బాగా కుదిరేటట్లు చేస్తుంది.

7. నిత్యశుద్ధం - నిరాభ్యాసం
నిరాకారం - నిరంజనం
నిత్యబోధం - చిదానందం
గురుఃబ్రహ్మ నమామ్యహం.

8. ఎవడు అన్నింటిలో నన్ను, నాలో అన్నింటిని చూస్తాడో వాడంటే నాకు ప్రీతి (బాబా). అతడిని భగవంతుడు తానుగా చూసుకుంటాడు.

9. తీవ్రంగా వైరాగ్యం కలిగినపుడే సన్యసించాలి.

10. **జ్ఞానయజ్ఞం :** యజ్ఞంలో కట్టె నిప్పుగా మారి బూడిదై శాశ్వతమగును. అదే విధముగా జ్ఞానయజ్ఞంలో ముక్తుడు కూడా శాశ్వతమగును.

11. నిద్రపోయేటప్పుడు, నిద్రనుండి లేవగానే బాబానామం చేయాలి. అపుడు రాత్రంతా నామం సాగుతుంది.

12. ఇతరులను తిడితే వాడి దోషాలు మనకు, మనపుణ్యం వాళ్ళకి పోతుంది.

13. రేషన్ షాపువాడు ఎప్పుడు కొట్టుమూసి పోదామా అన్నభావంతో



తన వృత్తి చేసినట్లు ప్రాపంచికంగా బంధువులను, లౌకికాన్ని విడిచి వెళ్ళాలని కనిపెట్టి ఉండాలి.

14. భోజనం చేసేటపుడు తృప్తిగా భగవంతునికి అర్పించి తిననివాడు రాక్షసుడు. అంటే అన్నం వచ్చేందుకు ఎన్ని జీవరాసులు శ్రమించాయో, ఎంత యజ్ఞం జరిగిందో గుర్తించకుంటే పాపం చేసిన వాడవుతాడు.

15. మనలో ఉండే బలహీనతలే అద్దంలో వలె గురువులలోను కన్పిస్తాయి.

16. మొదట వ్యక్తిగతమైన స్వార్థం విడవాలి.

17. ప్రాపంచిక కార్యాలను ఉద్రేక పూర్వంగా కాక ధర్మంగా, కర్తవ్యంగా నిర్వహించడం వలన ఎంతకాలమైనా అంతే పట్టుదలతో చేయగలడు.

**14-7-76**

1. తనలోని గుణాలు దాచే గుణముంటే అతనికి తెలియకుండానే ఎన్నింటినో దాస్తాడు. అయితే త్వరలోనే తెలుస్తుంది అందరికి.

2. ఆస్తి, ఆరోగ్యము మొదలైనవన్నీ అంతరించేవే.

**17-7-76**

1. నడిచేటప్పుడు కాళ్ళకు 3 జానలు వరకు చూడాలి. తలెత్తి చూడడం పూర్తిగా తగ్గించాలి.

2. కామం చేత ప్రకోపింపబడని మనస్సు శాంతిగా ఉంటుంది.

3. తన గురువు యందు భగవంతుడనే నమ్మకం ఉంటే ఇంద్రియ నిగ్రహం కలుగుతుంది.

**18-7-76**

బుద్ధికర్మానుసారిణి.

**20-7-76**

1. తన భక్తునికి ప్రియమైనది యిస్తాడు గురువు. అంటే మనకు ముక్తి కంటే ప్రియమైనది వుండకూడదు.
2. ముక్తిపైన నిర్మలమైన కోరిక ఉండాలి.
3. ధ్యానం చేసేటప్పుడు పద్ధతులను ఊరికే మార్చకూడదు
   - (చివటం అమ్మ)
4. చరిత్ర పారాయణ తాధాత్మ్యం చెందే విధంగా చేయాలి ఇష్టమైన పనుల్లో లీనమైనట్లు.
5. బాబాలోని ఏ గుణాన్నైనా ధ్యానిస్తే అది అతి సులభంగా వస్తుంది.
6. 'అసంగము' అనే ఆయుధంతో బంధాలను త్యజించాలి.

**26-7-76**

1. చరిత్ర చదివేటప్పుడు తనకు జరుగుతున్నట్లు ఆ అద్భుతాలను అన్వయించుకోవాలి.
2. ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. అది ఏమిటి అంటే ధ్యానం అయ్యాక చేసే పనిని సాధన రూపంగా నిర్వర్తించేటట్లు ఆలోచించాలి.
3. ఇంద్రియ సుఖములు భగవంతునిపైనుంచడం మొదటిమెట్టు.
4. ఎవరివైపు మనం కామపూరితంగా చూస్తే వారి స్థితికి దిగజారుతుంది మనస్సు.



5. వాళ్ళను చూడకున్నా వారుండే వైపుకు అనవసరంగా తిరగకూడదు.
6. సృష్టిలో ఇటువంటి సంగతున్నదన్న విషయం గుర్తుండరాదు.
7. లౌకిక సుఖాలన్నీ చేపను పట్టే ఎరలాంటివి.
8. అభ్యాసం వలన, మమకారం లేకపోవడం వలన, మనస్సు ధ్యానంలో సంపూర్ణంగా నిలువగలదు.
9. ప్రాపంచిక కోరికలచే కదలింపబడని మనస్సు శాంతిస్తుంది.

**27-7-76**

1. నిండు గిన్నెను తొణకకుండా జాగ్రత్తగా తీసుకున్నట్లు మనస్సును ధ్యానం నుంచి చెదర నివ్వకుండా జాగ్రత్తగా నడచుకోవాలి.
2. తృప్తిని అభ్యసించాలి.
3. అన్ని పనులు ఆయనే చేస్తున్నారు అనుకోవడమే శరణు వేడటం
4. గర్వాన్ని, అసూయను మనస్సులోనికి రానీయకూడదు.
5. వ్యర్థము, నిష్ప్రయోజనము అయిన మాటలను, పనులను నిలిపివేయాలి.
6. ధ్యానం చేసేటప్పుడు ఎక్కడ తప్పిపోతుందో అనే జాగ్రత్త (సావధానం) ఉండాలి.
7. ఆత్మానుభవం పొందకుండా ఎన్ని ఆధ్యాత్మిక విషయాలు తెలుసుకున్నా వ్యర్థమే.
8. భగవంతుని గూర్చి చెప్పని మాటలు వ్యర్థం.

**30-7-76**

1. ఇంద్రియాలకు ఇష్టమైన దానిని ఆలోచించినందువలన దాని మీద కోర్కె కలుగును.

2. మనస్సు చెడ్డ తలంపులను చింతనలోనికి తెచ్చుకొన్నపుడు బలవంతంగా నైనా దైవిక విషయాలలోకి మరలించాలి.
3. కూర్మం (తాబేలు) ప్రమాదస్థితిలో శరీరాన్ని లోపలకు లాక్కున్నట్లు ఆలోచనలు (చెడ్డవి) వచ్చినపుడు ధ్యానంలో నిమగ్నంకావాలి. ఆలోచనలు నశించిన పిదప ఆలోచనలు ఎట్లా వస్తాయో చూడాలి.

**2-8-76**

1. చూపును చూసేవాడు భగవంతునికి ప్రీతిపాత్రుడు.
2. 'ఈ కనిపించేదంతా భ్రాంతి' అని ఖాళీగా ఉన్నపుడు చింతించాలి. జ్ఞానవాశిష్టంలో జగన్మిధ్య, బ్రహ్మ సత్యమని చింతించమని ఉంది.
3. సర్వసుఖాలను త్యజించాలి లేకుంటే ధ్యానం సుఖం అనిపించదు.
4. ఇంద్రియాల ద్వారా మనస్సు ఎవరికైతే పనిచేయునో వాడికి ముక్తిరాదు. అంటే మనస్సు ఇంద్రియాలలోంచి పనిచేయరాదు.
5. మనస్సు భగవంతుని పైకి పోవుచుండుటయే శాంతి.
6. ఈ జన్మకే ముక్తి సంపాదించక పోతే, మరుజన్మకు మనం ఈ లోగా చేసే దోషాలు వసతినే కల్పించక పోవచ్చు.
7. ఇంద్రియ సుఖము కోసం పరుగులు తీయుటే దుఃఖము. ఇది గాలానికి గల ఎర కోసం పరిగెత్తే చేపలాంటిది.

**మిలారేపా బోధనలు - 10 లోపాలు.**

1. విశ్వాసం తక్కువ బుద్ధిబలం ఎక్కువైతే వాచలత్వం పెరుగుతుంది.



2. విశ్వాసం బలంగాను, బుద్ధిబలం బలహీనంగా వుంటే సంకుచితత్వము, మూఢత్వము ఉంటాయి.
3. ఉపన్యాసంలోని ఉత్సాహం అతికి కారణమౌతుంది.
4. శ్రవణ, మననాదులతో సిద్ధపరచని మనస్సు ధ్యానించయత్నిస్తే అజ్ఞానం, చాంచల్యం మరింత ఎక్కువ అవుతుంది.
5. తత్వాన్ని ఆచరణ పూర్వకంగా తెలుసుకోకుంటే అహంకారానికి కారణమౌతుంది.
6. మనస్సులో, నిస్వార్థం, కరుణ నెలకొనక పోతే తన ఒక్కడి ముక్తినే కోరే ప్రమదముంది.
7. భౌతిక వస్తువులను అనుభవించాలని ఆ అనుభవాలను పొందే మనస్సు, వస్తువు లేక పదార్థం కాదని గుర్తించక పోతే ప్రాపంచికతలో మునిగి పోయే ప్రమాదముంది.
8. లౌకికమైన ఆశలన్నింటిని నిర్మూలించక పోతే ప్రాపంచకానికి బానిసవుతాడు.
9. అవివేకులను దరిచేర్చి స్తుతింపనీయరాదు. అలాచేస్తే అహంకారం బలపడుతుంది.
10. తన సిద్ధులను గూర్చి విశేషజ్ఞానం గూర్చి ప్రగల్భాలు పలికితే వాటిని ప్రదర్శించడమనే పొరపాటులో పడతాడు.

1. దుర్లభమైన మానవ జన్మ పొందియు, ఆధ్యాత్మికతను పొందకపోవడం, దురదృష్టం.
2. ఒకసారి సన్యసించి మరలా సంసారంలో దిగితే అగ్నిలో పడ్డ మిడత లాంటి వాడే అవుతాడు.
3. మహాత్ముని సన్నిధిలోవుండి కూడా ఉపయోగించకపోతే కోనేటి వద్ద దాహంతో మరణించినట్లే.
4. అధ్యాత్మికంగా మంచి ధర్మాలు తెలిపే వైరాగ్యం

పెంచుకోకపోతే దగ్గరే మందుల సంచి వుండి కూడా ఉపయోగించు కోనట్లే.

5. అందరికి చెబుతూ తాను అచరించకుండా ఉండుట చిలుక పలుకలు.

6. దొంగతనం, మోసాలు చేయడం వలన సంపాదించిన ధనంతో దానధర్మాలు చేయడం నీటితో నిప్పును అంటించడంలాంటిది.

7. దేవతలకు మాంసాదులను నివేదించడం తల్లికి బిడ్డ మాంసం పెట్టడం లాంటిది.

8. కీర్తి కోసం పుణ్యకార్యాలు చేయడం చింతామణిని యిచ్చి పేడముద్దను పుచ్చుకోవడం లాంటిది.

9. స్వార్థం కోసం ఓర్పు వహించడం పిల్లి ఎలుకను పట్టుటకు వహించిన ఓర్పు లాంటిది.

10. తత్వోపదేశం విని కూడా మార్పు చెందనివాడు వైద్యుడైవుండి దీర్ఘవ్యాధితో బాధపడడం లాంటిది.

11. సాధనా మార్గాలు తెలిసికూడా అనుభూతిని పొందనివాడు ధనాగారపు తాళం చెవిని కోల్పోయిన ధనికుడు.

12. ఆచరణలో పెట్టక బోధించువాడు ఒక గుడ్డివానిని నడిపించే మరొక గుడ్డివాడు.

13. ధ్యానారంభంలో వచ్చే అనుభవాలన్నీ పూర్తి జ్ఞానం అనుకున్నవాడు యిత్తడిని చూసి పుత్తడి అనుకొన్నవాడు.

**బలహీనతలు**

1. ఏకాంతవాసం చేసే సాధకుడు. ప్రాపంచిక చింతలో మునగడం బలహీనతకు చిహ్నం.

2. మఠాధిపతియైన సాధకులు, సాధకుల శ్రేయస్సుకాక స్వార్థాన్ని ఆశించుట.



3. బాహ్యచారాలు చేసికూడా నైతిక నిగ్రహం లేకపోవుట.

4. సాధకుడు ఇష్టాఇష్టాలకు గురికావడం.

5. సన్యాసి పుణ్యాన్ని ఆశించుట.

6. ఒకసారి సమాధిస్థితి వచ్చి కొనసాగించలేకపోవడం

7. ఆధ్యాత్మిక జీవితానికి పూర్తి అవకాశం వుండి కూడా ప్రాపంచికత కల్గి ఉందుట.

8. తిండి, గుడ్డ అడగకుండానే యిచ్చే అవకాశం వుండికూడా ఏకాంతవాసంలో దీక్ష తీసుకోకపోవడం.

9. ఆధ్యాత్మిక శక్తులను ప్రకటించడం.

10. ద్వంద్వార్థాలతో, చమత్కారాలతో ద్వేషించడం.

11. నేను సాధకుడినంటూ ఏకాంతవాసంలో సాధన చేయక పోవడం. నలుగురిలో సామరస్యంగా జీవించకపోవడం రెండవ బలహీనత.

12. కష్ట సుఖాలలో సమభావం లేకపోవడం.

**అత్యావశ్యకతలు**

1. తత్వాన్ని అర్థం చేసుకొని తన నిత్యజీవితంలో అలవరచుకునే బుద్ధి కుశలత ఉండాలి.

2. అంతులేని జనన మరణ పరంపరలపై తీవ్ర విముఖత మొదట నుండి ఉండాలి.

3. సమర్థుడైన గురువు అత్యావశ్యకము.

4. కష్టాలలో ధైర్యం, యత్నంలో పట్టుదల, వ్యామోహాలకు లొంగక పోవడం ముఖ్యం.

5. వెనుకచేసిన దుష్టకర్మలు పవిత్రకర్మల ద్వారా తుడిచివేయడం.

6. శరీరం యొక్క సౌశీల్యము, మనస్సు యొక్క పవిత్రతను, వాక్కు యొక్క నిగ్రహాన్ని కాపాడుకోవాలి.

7. అన్ని దృక్పథాలను సమన్వయించుకోగల విశాలదృష్టి కావాలి.
8. దేనిపైన అయినా, ఎంతసేపు అయినా మనస్సు నిలుపగల సామర్థ్యం. అవసరం సాధనగా మార్చుకునే చాకచక్యం కావాలి.
9. ఉపదేశ పదాలుకాక అనుభవంగా పరిగణించే సాధన కావాలి.
10. తను పతనం కాకుండా వ్యామోహంలో పడిపోకుండావుండే ప్రత్యేక అవకాశం గురువు నుంచి పొందాలి.
11. అంచచలమైన విశ్వాసం, ప్రశాంతత మృత్యుసమయంలో అత్యావశ్యకం.
12. మనస్సు, శరీరం వాక్కులను దివ్యమైనవిగా మార్చుకొనే శక్తులను పొందడానికి చేయవలసిన సాధన అత్యావశ్యకం.

**ఉత్తమ లక్షణాలు**

1. అసూయ, గర్వం లేకపోవడం.
2. కోరికలు లేకుండా చాలా స్వల్పంతో తృప్తి చెందడం.
3. కంటిపాపవలె తన నడవడిని కాపాడుకోవడం (ప్రతి పనికి కర్మ ఫలం అనుభవించాలి అన్న జ్ఞానం ద్వారా)
4. తాను చేసిన ఒప్పందాలకు, బాధ్యతలకు కట్టుబడి ఉండడం.
5. అన్నింటిపై సమభావంతో ఉండటం.
6. దుర్మార్గుల పట్ల కోపానికి బదులు జాలి కలిగివుండటం.
7. విజయాన్ని ఇంకొకరికి వదిలిపెట్టి అపజయాన్ని తాను పొందడం (బాబా)
8. ప్రతియోచనలోను, పనిలోను అందరినుంచి భిన్నంగా ఉంటాడు.
9. సౌశీల్యమును, పవిత్రతను జాగ్రత్తగా కాపాడుకొంటూ గర్వంలేకుండా ఉండడం.



**పనికిరాని గుణాలు**

1. శరీరం భ్రాంతిమయం, అశాశ్వతం కావడం వలన దానిని గూర్చి అతిశ్రద్ధ తగదు.
2. చనిపోయినపుడు ఒట్టి చేతులతోనే పోతాము. మరునటి దినమే ఎత్తివేస్తారు. కాబట్టి ప్రాపంచిక వస్తువుల సేకరణకు ఏ ఇబ్బందులకు గురికావడం అనవసరం.
3. చనిపోయిన పిదప తన వారసులు సహకరించలేరు కాబట్టి వారికి కేవలం ఐహికమైన ఆస్తినివ్వటం వ్యర్థం.
4. బంధుమిత్రులను విడిచి వెళ్ళాలి కాబట్టి మన కాలాన్ని వారిని తృప్తి పరచడం కోసం వ్యర్థం చేయరాదు.
5. మన వారసుల జీవితాలు కూడా అశాశ్వతమే కాబట్టి వారికి అశాశ్వతమైన ప్రాపంచిక వస్తువులు సంపాదించి పెట్టడం వ్యర్థం.
6. మరణంలో సర్వాన్ని విడిచి వెళ్ళాలని తెలిసినపుడు ప్రాపంచిక వస్తువులను పోగు చేయడంలో కాలం వ్యర్థం చేయరాదు.
7. సాధనలో నియమ నిష్టలు పాటించకపోతే జీవుడు ఘోర స్థితులను పొందవలసివస్తుందని తెలుసుకొని పవిత్రజీవితం గడపలేని వాడు సన్యాసం తీసుకోకూడదు.
8. ఆధ్యాత్మికతను గూర్చి తెలిసికూడా మరణసమయంలో రక్షించగల శక్తిని సాధించలేకపోవడం వ్యర్థం.
9. భక్తి, వినయాలు లేనందువలన దీర్ఘకాలం గురుసన్నిధిని అనుభవించి కూడా ఆధ్యాత్మిక పరిణితి చెందనివారి జీవితం కూడా వ్యర్థం.
10. సర్వము అశాశ్వతము, ప్రాపంచిక జీవితం వ్యర్థమని తెలిసికూడా అందులో నిమగ్నం కావడం నిష్ప్రయోజనము.

## కొని తెచ్చుకొన్న బాధలు

1. జీవనోపాధి లేకుండా గృహస్థుకావడం కోరి విషం తినడంలాంటిది.
2. ధర్మాన్ని విడిచి పిచ్చి మార్గంలో పోవడం, పిచ్చివాడు కొండమీద నుంచి దూకి బాధను కొని తెచ్చుకొనుట వంటిది.
3. ధర్మం చెప్పి అధర్మంగా నడవడం అన్నంలో విషం కలుపుకోవడంలాంటిది.
4. నిశ్చలమైన మనస్సు లేకనే ఆశ్రమ నిర్వహణ భుజాన వేసుకోవటం ముసలమ్మ గొడ్లను కాపలా కాయడం లాంటిది.
5. ఇతరుల మేలుకోరి పాటుపడక స్వార్థానికి అంకితం కావడం గుడ్డివాడు ఎడారిలో దారితప్పడం లాంటిది.
6. శక్తికి మించి పనులను తనపై వేసుకోవడం మోయలేని భారాన్ని నెత్తిని వేసుకోవడం లాంటిది.
7. సద్గురువు చెప్పిన ధర్మాలను గర్వం, అహంకారాల వలన ఉల్లంఘించుట రాజు తల్లితండ్రుల పాలన చేసినట్లని బుద్ధుడు చెప్పాడు.
8. ధ్యానంలో నిమగ్నం కాక పట్టణాలలో, పల్లెలలో పర్యటించడం లేడి తనకు భద్రమైన పర్వతారణ్యములను వదిలి పల్లపు ప్రాంతాలకు వచ్చినట్లుంటుంది.
9. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించుకోకుండా వ్యవహారిక జీవితంలో దిగడం పక్షి తన రెండు రెక్కలను విరగొట్టుకోవడం లాంటిది.
10. గురువు యొక్క ధనాన్ని, దైవం యొక్క ధనాన్ని స్వంతానికి వాడుకోవడం పిల్లవాడు నిప్పును మింగడం లాంటిది.



## ఆత్మ శ్రేయస్కరమైన విషయాలు

1. లౌకిక ధర్మాన్ని పరిత్యజించి ఆధ్యాత్మికతకు జీవితాన్ని అంకితం చేయడం తనకు శ్రేయస్కరం.
2. గృహాన్ని, స్వజనాన్ని విడచి సద్గురువును అంటిపెట్టుకోవడం శ్రేయస్కరం.
3. ప్రాపంచిక వ్యవహారాలు విడిచి తన కాలాన్ని గురువు వద్ద భగవతత్వాన్ని గూర్చి వినడం, మననం చేయడం, ధ్యానం చేయడం వంటి పనులకు అంకితం చేయడం శ్రేయస్కరం.
4. మామూలు స్నేహాలు మానివేసి, ఏకాంతంలో జనసంపర్కాన్ని వదిలి నివశించడం శ్రేయస్కరం.
5. సుఖాపేక్ష, ధనాపేక్ష పరిత్యజించి కష్టాలనోర్చుకోవడం మంచిది.
6. ధన, ధాన్యాపేక్ష వదులుకొని స్వల్ప విషయాలతో తృప్తి చెందడం శ్రేయస్కరము.
7. ఇతరులను తనకోసము వాడుకోకుండా ఉండటం శ్రేయస్కరము.
8. అశాశ్వతమైన ఐహికమగు కోర్కెలనుండి విముక్తుడై ముక్తి పొందడానికి యత్నించడం శ్రేయస్కరం.
9. అశాశ్వతము, అసత్యమైన రూపము కలిగిన భౌతిక వస్తువుల వట్ల వ్యామోహాన్ని విడిచి వాస్తవాన్ని తెలుసుకోవడం శ్రేయస్కరము.
10. త్రిగుణాలను యధేచ్ఛగా విడవక వాటిని సద్వినియోగము చేసుకోవడము ద్వారా ఇహపర శ్రేయస్సును పొందడం మేలు.

## ఉత్తమోత్తమమైన విషయాలు

1. అల్పబుద్ధి వికాసం కలవాడు కర్మసూత్రంపై విశ్వాసం వుంచడం అతిశ్రేయస్కరము.
2. సామాన్యమైన బుద్ధి వికాసం కలవాడు తనలోను, బయట కూడా ద్వంద్వాలను గుర్తించడం శ్రేయస్కరము.
3. ఉత్తమమైన బుద్ధివికాసం కలవాడు జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానము వేరుకాదని అర్థం చేసుకోవడమే శ్రేయస్కరము.
4. ఒకే వస్తువుపై ధ్యానం నిలపడం అల్పబుద్ధి కలవాడికి శ్రేయస్కరం.
5. సామాన్యబుద్ధి కలవాడు మనస్సు, చైతన్యము, నామరూపాలు, వాటి కాధారమైన సత్యము వాటి గురించి తెంపు లేకుండా ధ్యానించడం శ్రేయస్కరం.
6. ధ్యానము, ధ్యాత, ధ్యేయము ఒకటేనని ఎరిగి ఏ తలంపులు లేకుండా నిరామయ స్థితిలో ఉండటమే ఉత్తమునికి శ్రేయస్కరం.
7. అల్పబుద్ధి కలవానికి కర్మ సిద్ధాంతమునననుసరించి నడుచుకోవడం శ్రేయస్కరం.
8. రెండవవాడికి వస్తువులన్నీ స్వప్న తుల్యాలు అని భావించడం శ్రేయస్కరం.
9. మూడవవాడికి ప్రాపంచికమైన పనులు కోరికలు మాని ఉండటమే శ్రేయస్కరం.
10. ఈ ముగ్గురికి స్వార్థం, సత్యాన్ని మరుగుపరిచే కోరికలు, వికారాలు క్రమంగా సన్నగిల్లడమే పురోగతికి సూచనం.



## పెద్ద పొరపాట్లు

1. సరియైన గురువును ఎన్నుకోకపోవడం
2. సద్గురువు యొక్క ఆత్మోపదేశానికి యత్నించక శాస్త్ర పాండిత్యములో చిక్కుకోవడం.
3. ఏ రోజుకారోజు తన జీవితంలో చివరి రోజని తలచక తను ఎల్లకాలం వుండబోతామని భ్రమించి పెద్ద పెద్ద పథకాలు వేయడం.
4. ఏకాంతంలో ధ్యానించడం ద్వారా అనుభవజ్ఞానాన్ని పొందక మునుపే బోధించడానికి ఉపక్రమించడం.
5. ధనాన్ని దానధర్మాలకు వినియోగించక లోభివలె కూడ పెట్టడం సాధకుడికి పెద్ద తప్పు.
6. త్రికరణాలు, సౌశీల్యము మొదలైన ధర్మాల కంకితం కాక తుచ్ఛసుఖాలకు లోబడటం.
7. జ్ఞాన సముపార్జనకుకాక ఆశలు, భయాలకు జీవితం అంకితం చేయడం సాధకుడికి ప్రమాదకరం.
8. తనను సంస్కరించుకొనక ఇతరులను సంస్కరింపచూడడం.
9. తనలోని ఆధ్యాత్మిక శక్తి కోసం కాక లౌకికమైన శక్తికోసం ప్రాకులాడటం.
10. సాధనకు పరిస్థితులనుకూలించడం లేదని యత్నించక సోమరిగా అజాగ్రత్తగా కాలం గడపడం.

## సాధనకు అవసరమైన విషయాలు

1. సాధన ఆరంభం నుంచి కూడా సాధకులకు జన్మ పరంపరల యెడల తీవ్ర విముఖత ఉండాలి.
2. తన ప్రాణాలను అర్పించడానికి కూడా వెనుదీయని పట్టుదల, దీక్ష సాధనకవసరమైన రెండవ లక్షణము.

3. ఎంతో ఘనకార్యము చేసినవారికి ఉండే తృప్తి, సంతోషాలు సాధకుడికి ఉండాలి.
4. బాణంతో దెబ్బతిని మృత్యుముఖంలో వున్నవాడికివలె జీవితంలో ఒక్కక్షణం అయినా వృధాచేయరాదు అన్న గుర్తింపు ఉండాలి.
5. ఉన్న ఒక్క బిడ్డ తప్పిపోతే తల్లి మనస్సు అతనిపై ఎంతగా తల్లడిల్లిపోతుందో ఆ విధంగా సాధన ఉండాలి.
6. ఆధ్యాత్మిక గ్రంధాలు - త్రికరణాలతో ఏమిచేయక నిశ్చలంగా ఉండి నేవే బ్రహ్మమని తెలుసుకోమని చెబుతాయి. అందుకు అన్యంగా చేయవలసినవి ఏదీలేదని సాధకుడు తెలుసుకోవాలి.
7. ఆకలిగొన్నవాడు అన్నంకోసం తపించినట్లు జ్ఞానం కోసం సాధకుడు తపించాలి.
8. ధృడకాయుడు తన చేతనున్న రత్నాన్ని తాను కాపాడు కోగలనని ఎంతటి విశ్వానం ఉంటుందో, అంతటి ఆత్మవిశ్వానం సాధకుడు కలిగివుండాలి, (అంటే నేను మోక్షాన్ని సాధించగలను అని).
9. మోసగాని అబద్ధాన్ని బయట పెట్టినట్లు ద్వైతభావం లోని దోషాన్ని సాధకుడు బట్టబయలుచేయాలి.
10. సముద్రాల మీదుగా ఎగిరి అలిసిపోయిన కాకి ఓడలోని కమ్మిమీద ఎంత స్థిమితంగా విశ్రమిస్తుందో అంత పూర్తిగా భక్తుని హృదయం బ్రహ్మం ఉన్నదన్న విశ్వానంతో విశ్రమించాలి.

**అనవసరమైనవి**

1. మనస్సు యొక్క నిజతత్త్వం శూన్యత అని గుర్తించక శ్రవణ, మనన ధ్యానాదులతో అవసరంలేదు.



2. ఆత్మ పరిశుద్ధిని పొందినవాడికి అనగా ఆత్మనిత్య శుద్ధమని అనుభవపూర్వకంగా గుర్తించిన వానికి ప్రాయశ్చిత్తాలతో పనిలేదు.
3. అలానే మనస్సు నిశ్చలమైన వాడికి కూడా అవసరం లేదు.
4. శుద్ధమైన ఆత్మస్థితిని పొందినవాడికి సాధనలతో పనిలేదు.
5. ఇంద్రియ మనో గోచరములన్నీ అనత్యమైనవని అనుభవపూర్వకంగా గుర్తిస్తే నిరామయమైన స్థితిని ధ్యానించవలసిన అవసరంలేదు.
6. సత్యాన్ని మరుగుపరిచే ఉద్రేకాలన్నీ అసత్యాలని గుర్తిస్తే వేరే పోగొట్టు కోవలసినవి ఏవీలేవు.
7. నామరూపాలన్నీ అసత్యమైనవని గుర్తిస్తే వాటిని నిరాకరించవలసిన అవసరంలేదు.
8. దుఃఖము, దురదృష్టము నిజంగా శ్రేయస్కరమని గుర్తిస్తే సుఖం కోసం వేరే ప్రాకులాడవలసిన పనిలేదు.
9. మన చైతన్యం జనన మరణ రహితమైనదని తెలుసుకుంటే చైతన్యాన్ని ఒక అవస్థ నుంచి ఇంకో అవస్థకు మార్చుకోవలసిన పనిలేదు.
10. తను చేసే ప్రతిపనిలోను ఇతరుల శ్రేయస్సు కొరకే ప్రయత్నిస్తుంటే తన మేలుకోసం వేరే ప్రయత్నించవలసిన పనిలేదు.

**ప్రశస్తమైన విషయాలు**

1. దేవ, అసుర, పశు, ప్రేత, నరకలోకాలలో ఉన్న అసంఖ్యాకమైన దేహాలలో కెల్ల ఒక్క మానవదేహం విలువైనది.
2. అసంఖ్యాకులైన లౌకికుల కన్న ఒక్క మహాత్ముడు మేలు.

3. బాహ్యమైన ఉపదేశాలన్నింటికంటే నిగూఢమైన ఒక్క ఉపదేశం మేలు.
4. ధ్యానం ద్వారా పొందిన జ్ఞానం క్షణమాత్రమే అయినా కేవలం వినడం, యోచించడం వల్ల వచ్చిన జ్ఞానం కంటే ఎంతో మేలు.
5. పరహితం కోసం సమర్పించబడిన పుణ్యం కొద్దియైనా తన మేలు కోసం చేసుకున్న పుణ్యం కంటే శ్రేష్ఠం.
6. ఆలోచనలు లేని సమాధి క్షణమాత్రమే అయిన అనేక యోచనలతో కూడిన దీర్ఘకాలం అనుభవించిన సమాధికంటే మేలు.
7. ఇంద్రియ సుఖములు ఎంతైనా క్షణమాత్రం అనుభవించిన జ్ఞానంతో సాటికాదు.
8. నిస్వార్థంతో చేసిన ఎంత చిన్న కార్యమైనా, స్వార్థంతో చేయబడ్డ అసంఖ్యాకమైన పవిత్ర కార్యాలకంటే మేలు.
9. ప్రాపంచికమైన ధనాన్ని ఎంత దాన ధర్మాలకు వినియోగించినా రాని ఫలితం, గృహము, కుటుంబము, యాత్రలు, ఆస్తి, కీర్తి, ఆయుస్సు, ఆరోగ్యము మొదలైన ప్రాపంచిక వస్తువులను పరిత్యజించడం వలన వస్తుంది.
10. సృష్టి ఆదినుండి ప్రాపంచిక లబ్దికొరకు పొందిన అసంఖ్యాకమైన జన్మలన్నింటికంటే, ముక్తి సాధనకు అంకితం చేసిన ఒక్క జన్మచాలు.

**సమానమైన విషయాలు**

1. నిజమైన ఆధ్యాత్మిక జీవితాన్ని కొనసాగించేవాడు లౌకికకార్యాలు కొనసాగించకున్నా ఒక్కటే.



2. మనస్సు యొక్క నిజరూపం ఆత్మనని తెలిసినవాడు ధ్యానించినా, ధ్యానించకున్నా ఒక్కటే.
3. సత్యాన్ని తెలిసినవాడు కొండపై ఏకాంతవాసం చేసినా భిక్షువుగా దేశాటనం చేసినా ఒక్కటే.
4. మనోనిగ్రహం సాధించిన వాడు ప్రాపంచిక సుఖాలను అనుభవించినా ఒక్కటే.
5. సర్వజీవరాశియందు సంపూర్ణమైన కరుణకలవాడు ఏకాంతంలో వుండి ధ్యానించినా, సమాజంలో ఉండి ఇతరుల కోసం పనిచేసినా ఒక్కటే.
6. గురువుయందు అత్యంత భక్తి కలవాడు గురువు సమక్షంలో వున్నా, లేకున్నా ఒక్కటే.
7. ఆధ్యాత్మిక బోధనలు పూర్ణంగా అర్థం చేసుకొన్నవాడికి అదృష్టంవచ్చినా, దురదృష్టం వచ్చినా ఒక్కటే.
8. ప్రాపంచిక జీవితాన్ని పరిత్యజించి ఆధ్యాత్మిక సాధనకు అంకితమైన వాడికి ప్రాపంచిక ధర్మాలు పాటించినా, పాటించక పోయినా ఒక్కటే.
9. పూర్ణ జ్ఞానం కలిగినవాడికి తన అద్భుతశక్తులను ప్రదర్శించ గలిగినా ప్రదర్శించలేకున్నా ఒక్కటే.

**ధర్మం యొక్క లక్షణాలు**

**ఆధ్యాత్మిక ధర్మం యొక్క మహత్వ్య నిరూపించేవి 10 పవిత్రమైన కార్యాలు:-**

1. ప్రాణాన్ని రక్షించడం
2. సౌశీల్యం - బ్రహ్మచర్యం
3. దానం (దేహంతో చేయబడేవి)
4. నిజం చెప్పడం, శాంతిని నెలకొల్పడం

5. మృధుబాషణ
6. అధ్యాత్మిక బోధ
7. ఔదార్యం
8. సర్వజీవుల మేలుకోరుట (మనస్సుతో చేసేవి)
9. సౌమ్యత
10. విశ్వాసం

## సత్యం గురించి పరిపూర్ణతను గురించి బోధలు

**ఉత్తమగుణాలు - 4**

1. సంసారమనెడి దుఃఖము.
2. ఈ దుఃఖానికి కారణమైనది తృష్ణ (అరిషడ్వర్గాలు)
3. తృష్ణ నిర్మూలన ద్వారా దుఃఖనివారణం
4. అష్టాంగంలో కూడిన దుఃఖనివారణకు మార్గం.

**ధ్యానస్థితులు - నాలుగు**

1. వితర్కస్థితి : యోచనలను తర్కించుకొని చూచుట
2. విచార స్థితి : విత్కరం ద్వారా తెలిసిన సత్యాలను గూర్చి మననం చేయడం
3. వితర్క, విచారల యందు వాటి ఫలితాలయందు ప్రీతి.
4. సుఖస్థితి లేక ఆనందము ఇదే ఏకాగ్రత.

ఈ నాలుగు కలసి ఒక ధ్యాన స్థితి.

రెండవ స్థితిలో వితర్క విచారాలుండవు. మూడవస్థితిలో ప్రీతికూడా ఉండదు. ఏకాగ్రత, సుఖాలతో పాటు స్మృతి, ఉపేక్షలు (నిశ్చలత) ఉంటాయి. నాల్గవస్థితి పరిపూర్ణమైన స్మృతి, ఉపేక్ష, ఏకాగ్రతల సమైక్య రూపమైన సమాధి.



**రూప రహితమైన స్థితులు**

1. అకాశ, అనంత ఆయతనము : అనగా అనంతమైనఆకాశంలో ఉండే చైతన్య స్థితి.
2. విజ్ఞాన అనంత ఆయతనము : కేవల అనంత చైతన్యస్థితి.
3. అకించిన్నాయతనము : అనగా ఎరుక ఎరుకగాని స్థితి.

**వివరణ :**

ఎ) అకాశము తప్ప వేరు ధ్యేయ వస్తువు ఉండదు.

బి) అనంతమైన ఆకాశం కూడా ధ్యేయం లేని అతీత స్థితి.

సి) అకాశం కూడా ధ్యేయవస్తువు కాదన్న యోచనలేని స్థితి.

డి) కేవల చైతన్య స్థితి.

**ఆధ్యాత్మిక మార్గాలు - రెండు**

1. ఎ) హీనయానము బి) మహాయానము.
   హీనయానము : సఖావృత్తి, పశ్చిమ స్వర్గములను అరూపలోకాలను పొందే మార్గము.
   మహాయానము : పైలోకాలకు అతీతమైనది - నిర్వాణస్థితి.
2. బుద్ధుడు, అశ్వఘోష, నాగార్జున, అలోప మొదలైన మహనీయులెందరో జ్ఞానాన్ని పొందడం తపస్సు ద్వారానే. నలువురు దిక్పాలకులు, ముల్లోకాలలోని అరు విధాలైన దేవతలు, రూపలోకాలలోని 17 విధాలయిన దేవతలు, అరూపలోకాలలోని 4 విధాలైన దేవతలు ఆధ్యాత్మిక మార్గం యొక్క శ్రేష్ఠతకు నిదర్శనాలు.
3. ప్రపంచంలో సాధనలో ప్రవేశించిన వారు కొందరు, మరొక జన్మ మాత్రమే కలవారు కొందరు,జన్మరాహిత్యము పొందిన

వారు కొందరు, సిద్ధులు, ఆత్మజ్ఞానులు కొందరు ఉంటారు. వీరు ఆధ్యాత్మిక మహాత్మ్యాన్ని చాటుతారు.

4. సృష్టి అంతంవరకు జీవరాశియొక్క తరింపుకొరకు మరల మరల అవతరిస్తారు పూర్ణులు.
5. లోకంలో జీవులకు ముక్తి లభించేందుకు అనువైన ఆధ్యాత్మిక శక్తి అట్టిమహనీయుల తపస్సు వల్లనే లభ్యం అవుతుంది.
6. కారుణ్యంతో కూడి స్వల్పమైన పుణ్యాలు చేసినవారు కూడా దుఃఖపూరితమైన జీవితంలో తత్ఫలితంగా కించిత్ అయినా సుఖం అనుభవిస్తారు.
7. దుర్మార్గులు కూడా పరివర్తన చెంది సాధన ద్వారా మహనీయులు కావడం విశేషం (మిలారేపా)
8. సర్వాన్ని త్యజించి గుహ అరణ్యాలలో దాగి తపస్సు చేసిన మహనీయులను కూడా ప్రజలు అన్వేషించి సేవించాలి.

**అద్భుతమైన అనుభవాలు (జ్ఞానాలు)**

1. సకల జీవుల మనస్సులు విశ్వచైతన్యానికి అన్యం కావాలి. తెలుసుకోవడం అద్భుతం, ఆనందకరమగు జ్ఞానం.
2. మూలసత్యం, నిర్గుణం అని తెలుసుకోవడం.
3. అనంతము, భావాతీతము అయిన జ్ఞానస్థితిలో నానాత్వము, లేక వైవిధ్యము ఉండదని తెలుసుకోవడం.
4. జనన మరణ రహితమైన సహజస్థితిలో భావస్పందన వుండదని తెలుసుకోవడం.
5. ధర్మకాయంలో పదార్థము, చైతన్యం వేరుకావు. ఆస్థితిలో ఏ సిద్ధాంతాన్ని సమర్థించేవారు వుండజాలరు. ఈ సత్యం తెలుసుకోవడం.



6. స్వయంభువు, దివ్యము అయిన నిర్మాణకాయంలో కూడ (స్థూల దేహరూపం ధరించిన మహనీయులకు) ద్వైతము ఉండదని తెలుసుకోవడం.
7. పరిమితమైన జీవుడు నిజంగా వునికిలేనివాడు అని తెలియడం.
8. దివ్యము, అనంతము అయిన బోధిసత్వుల కరుణలో ఎట్టి లోపము, పక్షపాతము ఉండవని తెలియడం.
9. అందరు "బుద్ధుల" నడచిన ముక్తి మార్గం శాశ్వతము మార్పులేనిది. నడవదలచిన వారికి సదా సుగమము యినది అని తెలుసుకోవడం.

**7 8-76**

1. అరుణాచలం భూమికంతకు ఆధ్యాత్మిక కేంద్రం. అన్ని పుణ్యాల క్షేత్రాల కన్న గొప్పది (మేరుపర్వతం)
2. 'నేను' ను ధ్యానిస్తే Chest కుడివైపున అనుభూతి కలుగుతుంది.
3. రమణమహర్షి దక్షిణామూర్తి అయినందువలన 'నేను' ను గూర్చి ధ్యానించాడు. అంటే 'నేను' ను ధ్యానించడం ద్వారా పరిపూర్ణత చెందాడు.

**8-8-76**

1. ఇంద్రియలోలుడు నీచుడు.
2. ఇంద్రియసుఖాలకతీతుడే దైవత్వం కలవాడు.
3. వయిపు తప్పిన గడియారాన్ని అటుఇటు గ్రుడ్డిగా కదిలించి పనిచేసేటట్లు చేయడం సాధారణంగా ధ్యానించి విముక్తిపొందడం. అన్నింటిలోనూ ఒక్కటే ఉన్నదని 'ఏది నిజం'లో వలె ధ్యానిస్తూ సాధనచేస్తే ముక్తి పొందడం మెకానిక్

వూడదీసి తొలగిపోయిన దాన్ని సరిచేసి పనిచేసేటట్లు చేయడంలాంటిది.

4. సూర్యుడు, ఆకాశం భూమినంతటిని ప్రజ్వలింపచేసినా హృదయంలోని మలినాన్ని మహాత్ముడే పోగొడతాడు.
5. శరీరం గురించి తలచడంలో భగవంతుడిని మరచిపోకుండా ఆయన చింతనలో శరీరాన్ని మరిస్తే చావునుజయించవచ్చు.
6. అన్యం గూర్చిన తలంపే హృదయంలోని మాలిన్యం
7. ఎంతటి జ్ఞానికైనా దుష్టుల సాంగత్యంలో జ్ఞానం మరుగుపడుతుంది.
8. శరీరం పోయేలోగా ముక్తికోసం ప్రయత్నించు.
9. శరీరం అనే వృక్షానికి కాలం అనేది గొడ్డలి పెట్టులాంటిది.
10. ముక్తికోసం ప్రయత్నించని వాడు ఆధ్యాత్మికంగా చచ్చినట్లే.
11. ఇంద్రియసుఖాల గూర్చి తీవ్రంగా ఆలోచిస్తే అలవాటుగా ఉన్నా తప్పించుకోవచ్చు.
12. లౌకిక వస్తువుల అశాశ్వతాన్ని గూర్చి చింతన చేయాలి.
13. లౌకిక వస్తువులపై విలువను పెట్టుకుంటే కోరిక ఏర్పడును.
14. ప్రతి సుఖానికి చివరగల దుఃఖం గురించి చింతన చేయాలి.
15. జనన మరణాలపై గల విసుగు ముక్తిమార్గానికి నౌకవంటిది.
16. అన్ని బాధలకు మనస్సే కారణం.
17. ఎల్లప్పుడు ధ్యానంలో ఉండటం త్రిగుణాల కతీతం
18. సత్వ, రజ స్తమో గుణాలు లేక 'నేను' ను ఎల్లప్పుడు చూస్తూ వుంటాడో అది తురీ యావస్థ. దానిని స్థిరపరచుట చివరి స్థితి.
19. ఇంద్రియాలు దేవతల యొక్క ప్రతిరూపాలు.
20. మనకు వచ్చే భావాలు, మనస్సు త్రిగుణాత్మకం.



**9-8-76**

1. అంతా గురువే 'తాను' నేను కాదన్న భావం కలిగివుంటే మనల్ని ఉద్ధరించడం ఆ పరమేశ్వరుడి విధి.
2. ఇంద్రియాలకు, మనస్సుకు కనిపించేదంతా వాస్తవం కాదు.
3. నేను ఈ సేవ చేస్తున్నాను అని అహంకరిస్తే సేవ అంతా నిష్ఫలం.
4. అహం లేకుండా నిశ్చలంగా వుంటూ బాహ్యసేవ చేయకపోయినా గురువును సేవించినట్లే.
5. గృహంలోకి ప్రవేశించేటప్పుడు గుమ్మం వద్ద తలవంచిపోకుంటే తలపగులుతుంది (అహంకారం)

**10-8-76**

1. తినేటప్పుడు మనస్సును జిహ్వాపై నుండి తొలగించాలి.
2. మనస్సుకు మూతవేస్తే భక్తి వైపుకు మొగ్గుతుంది.

**11-8-76**

1. గురువు ఎంతటి పనైనా చేయగలడు.
2. లౌకిక సుఖాలలో పడితే కొట్టుకుపోతాం. అవి మనకెందుకు? (సినిమా తెరమీద బొమ్మలలో లీనమైనట్లు, అదే వాస్తవం అనుకున్నట్లు)
3. చిన్న వయసులో ఆటలు, యవ్వనంలో ఆడపిల్లలపైన, వార్థక్యంలో చింతలపైన గడచిపోతుంది. ధ్యానం చేసేదెప్పుడు? అందుకని రేపు చేద్దాం అని వాయిదా వేయకూడదు.

## 12-8-76

స్త్రీలముఖం ఎప్పుడు చూడకూడదు. చూడాలనిపిస్తే పాదాలు మాత్రమే చూడాలి. (ఉదాహరణకు లక్ష్మణుడు) లేకుంటే దినదినానికి చెడుభావాలు బలపడుతాయి.

## 20-8-76

1. కోరిక అధర్మాన్ని చేయుంచును. కోరికల్ని జయించడం కంటే అతీతమైన ధర్మం వేరొకటి లేదు.
2. కోరికలు ఆర్తిగా పోయేసరికి తాను పరిమితుడన్న భావం తొలగుతుంది.
3. బాధలు లేకుంటే సుఖమూ వుండదు.
4. కోరికలను నశింపచేసుకొన్నవారు మాత్రమే ముక్తిని ఆశ్రయించగలరు.
5. 'అసంగము' అనే శస్త్రముతో కోరికల్ని నశింపచేయాలి.
6. ఇంద్రియాలద్వారా వస్తువులను అనుభవించాలి అనే వ్యామోహం మొదట అరికట్టాలి.
7. ఇంద్రియ విషయాలను చింతన చేయకుండా అదే సమయాన్ని భగవద్ధ్యానానికి వినియోగించాలి.
8. గురువుగారి మాట, ఆధ్యాత్మిక గ్రంధాలు, ఉద్బోధ, అనుభవమయ్యే ఆత్మజ్ఞానం కలిసి ముక్తినిస్తాయి.
9. మనసు పనిచేయకుండా నిలిచిపోవాలి.
10. తాను ఈ శరీరం కాదు అని తెలుసుకోవడం వల్ల మనస్సుకు కోరికలు నశిస్తాయి.
11. ఇంద్రియానుభవాల నుంచి మనస్సును సంహరించాలి.



12. మళ్ళీ, మళ్ళీ వచ్చే తలంపులను అణచివేయాలి. మళ్ళీ లేచే మనస్సును అప్పటికప్పుడు నశింపచేయాలి.
13. వివేక వైరాగ్యాలలో ఇంద్రియ సుఖాలకై పరుగెత్తే మనస్సును అణచాలి.
14. నిశ్చలంగా భగవద్భావాన్ని నిలుపుకోవాలి.

## 21-8-76

1. ఆలోచనలు లేని స్థితి మనస్సుకు అతీతమైన స్థితి.
2. ఏకభావన అంటే పంచభూతాలు, మనస్సు, బుద్ధి, అహంకారము (8 తత్వాలు) - ఆ పరంజ్యోతి అని గుర్తుంటుంది.
3. రూపాలకు బదులు రూపాలకాధారమైన దానిని చూడాలి (సాయిబాబా)
3. నేను - జగత్తు అనుభవమవుతున్నంత వరకు దుఃఖము తప్పదు.
5. ఏకభావన లేకుంటే మనస్సులో 'ఓంకారాన్ని' గురువుపై నిలిపి స్మరించాలి.
6. మనస్సు పంచేంద్రియాలపైకి పోయి పని చేసేటప్పుడు మనస్సును తన శత్రువుగా భావించాలి.
7. ఒక్క ఇంద్రియ ఆకర్షణ వలనే నాశనం చెందు చేప, ఏనుగు, తేనెటీగ, మిడుత మొదలైన వాటితో పోలిస్తే 5 ఇంద్రియాలకు లోబడివున్న మానవుని గతిఏమిటో ఆలోచించాలి.
8. స్త్రీ పంచేంద్రియాలను హరిస్తుంది. స్త్రీ యెడల అగ్ని భావం ఉండాలి.
9. ధ్యానంతో వచ్చిన ఫలితాన్ని స్త్రీ వ్యామోహంలో పోగొట్టుకోవడానికి ఎంతో అవకాశం వుంది. ఎక్కువ కష్టంతో సాధించిన వస్తువును అతి సులభంగా పోగొట్టు కొన్నట్లు.

10. త్రికరణాలతో బ్రహ్మచర్యాన్ని అవలంభించాలి.

**22-8-76**

1. సర్వసంగాలను పరిత్యజించడం కంటే ఎక్కువ సన్యాసం వేరొకటి లేదు.
2. శరీరం, ప్రాణం, ధనము అన్నింటినీ భగవంతునికి అర్పించడం దానాలన్నింటిలోకి ముఖ్యమైనది.
3. మనం కావాలనుకునే కోరికలన్నీ పరమపదాన్నుంచి లాగే దుఃఖబంధాలే. ఇవి చేపకై పెట్టే ఎరలాంటివి.
4. జగత్తును గూర్చిన స్మరణ పోవాలంటే నేను, నాది అనే భావాలు పోవాలి.
5. మనలోని యిష్టాయిష్టాలను నశింపచేయనంతవరకు సాధనలేదు.
6. బలవంతంగానైనా సత్త్వగుణ ప్రధానంగా ప్రవర్తించాలి. (ఆహారం కొరకు, ప్రవర్తన లాంటి విషయాల్లో)
7. మన గుణాలను బట్టే యిష్టాయిష్టాలుంటాయి.
8. బయటి వాటియందు మనకు గల వ్యామోహాన్ని తెగగొట్టాలి.
9. మనస్సుకు 5 ఇంద్రియాల ద్వారా ఆహారం (సత్త్వ, రజ స్తమో గుణ ప్రధానమైనవి) లభిస్తుంది.

**28-8-76**

1. ఇంద్రియార్థాలయిన వస్తువులున్నంతకాలం తాను శరీరమన్న భ్రాంతి పెరుగుతుంది. సాధన కొనసాగదు.
2. 'నేను' ఈ దేహం అనే భావం నశించేవరకు తన వాటిపై మమకారం చావదు.



3. కాబట్టి సన్యాసము అవసరము.
4. మొదట లౌకిక సుఖాలను బాహ్యంగా వదలాలి. పిదప వాటిపైనున్న వ్యామోహాన్ని వివేక వైరాగ్యాలతో విడవాలి. తరువాత వాటిని అనుభవించామన్న గుర్తింపును కూడా పై విధంగానే నశింపచేయాలి. ఇట్లు ఖాళీ అయిన మనస్సును భగవంతుడి సర్వవ్యాపకత్వాన్ని ధ్యానించడంలో నిమగ్నం చేయాలి.
5. "ఆనందాన్ని ధ్యానించు" , "సర్వవ్యాపకమైన చైతన్యాన్ని ధ్యానించు" (సాయిబాబా)
6. నిష్ఠ రాలేదని బాధపడుట కూడా నిష్ఠకు ఆటంకమే.
7. నిష్ఠకుదిరితే తాను పరిమితమైన దేహం అన్నభావం నశిస్తుంది.
8. దేహం ఉండగానే ధ్యానం సాధ్యంకాబట్టి, దేహంపై మమకారం వదలి ధ్యానంలో నిమగ్నం కావాలి.
9. అశాశ్వతమైన దేహంతో శాశ్వతమైన ముక్తి సాధించువాడే వివేకుడు. (వివేకుని లక్షణం)
10. శరీరము 'మాయ' ను తెగటార్చే ఖడ్గం అని గుర్తించాలి. (అనగా శరీరము ధరించి ఉండబట్టి) 'మాయ' ను జయించి ముక్తిని పొందుటకు వీలున్నదన్నమాట)
11. గురువులో లోపాలు కనిపిస్తే అవి నిజంగా లోపాలా! లేక తన గురువుగారు చెప్పినవి ఆచరించలేనపుడు తనలోని అనుభవాల వల్ల అట్లా అనిపిస్తుందా? అని గమనించాలి. సామాన్యంగా శిష్యుడి బలహీనతలే గురువుగారిలో అద్దం ముందు ప్రతిబింబం లాగా అనుభవమౌతాయి.
12. గురువు ఇవ్వదలచుకున్నదే తనకు అవసరమయివుండి, (తన లక్ష్యంగా ఉండి) మనస్సు, శరీరములతో అయన చెప్పినట్లు ఆచరించాలి.

13. నిష్ఠను సహజం చేసుకోవడానికి మార్గం నిష్ఠను ప్రయత్నంలో ఉంచుకుంటూండడమే.

## 30-8-76

1. అధ్యాత్మిక సాధనలో ఏవరేమి అనుకుంటారో అన్న సందేహం మొదట నశింపచేయాలి.
2. ఈ ప్రపంచం సరిగ్గా 'మయసభ' లాంటిది.
3. అన్ని సుఖాలు మనలక్ష్యాన్ని ఖర్చు చేసేవే.

**వార్తాలాపము (వైరాగ్య గ్రంథము)**

## 31-8-76

1. హృదయమందలి అజ్ఞాన నాశమే ముక్తి.
2. ఊరకనే వచ్చు తలంపుల పరంపర 'చిత్తము'.
3. ఒక ప్రత్యేక విషయాన్ని ప్రత్యేకంగా ఆలోచించేటపుడు మనసు పనిచేస్తుంది.
4. ఉపాధిః అన్నమయ, ప్రాణము, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయకోశములు.
5. ఇంద్రియానుభవాలపై గల ప్రీతి 'బంధం'. దాని నుండి విడివడటం ముక్తి.

## 2-9-76

1. అవసరమైతే నీరు త్రాగియైనా ప్రాణం నిలుపుకో. మహాత్ముల సన్నిధిలో ఉండి సుఖాలను త్యజించు.
2. సూదిబెజ్జం గుండా ఒంటైనా పోగలదు కాని స్వర్గద్వారాల గుండా ధనికుడు మాత్రం పోలేడు (క్రీస్తు)



## 5-9-76

1. ఇంద్రియ విషయాలు తటస్థపడినను వైరాగ్యం వున్నవాడు, తీవ్రవైరాగ్యం కలవాడు.
2. ఇంద్రియ ప్రవృత్తి వుంటే ధ్యానంలో ఏకాగ్రత కుదరదు.
3. ఊరకనే మాట్లాడుతుంటే ధ్యానం కుదరదు.
4. స్త్రీల యందు దోష దృష్టి కలుగుటచే అమె వలన ప్రమాదం ఉండదు.
5. స్త్రీ మూర్తులు బ్రహ్మజ్ఞానానికి అవరోధాలు.
6. ఆత్మానుభవానికి మార్గం 'నేను' ను చూడటం కంటే వేరు లేదు.
7. శరీరమే ఘోర నరకం.

## 6-9-76

1. మనకు కామం పై గల ప్రీతి వలన సుఖం అనిపిస్తుంది. అసహ్యకరంగా తోచదు.
2. ప్రపంచంలో కామం వలన ప్రయోజనమేమిటో చింతిస్తే దాని ని అనవసరంగా అనుభవించాల్సిన అవసరం ఉండదు.
3. అతీతమైన దానిపైగల ఆశ లోకంలోని కోరికలను వదలటానికి ఆధారం కావాలి.
4. **శరీరంపై వైరాగ్యం:-**

మరణానంతరం మన శరీరం పొందే స్థితిని గూర్చి, అపుడు మన బంధువులంతా ఏమౌతారో అని చింతన చేయుట మరియు మృత్యువు గురించి ఆలోచన మృత్యువు ఎంత భయంకరమైనదో అని ఆలోచించుట మరియు "ఈ శరీరము

రేపు చచ్చేలోగా" అని దాని సమస్య తీరేవరకు ఆలోచించి ఈ తుచ్ఛసుఖాల సంగతేమిటి? అని ఆలోచించాలి.

5. మమకారం పచ్చి స్వార్థం.
6. సజాతీయ భావాన్ని (అంతా బ్రహ్మమే) అన్నభావం కలిగి ఉండటం ధ్యానం.
7. మనస్సును ఇలా ప్రబోధించుకోవాలి :- ఓ మానసమా! నేను నిన్ను మిత్రునిగా తలచి ఇట్లు చేయుచున్నాను. వీటి (ఇంద్రియసుఖాల) పై వ్యామోహాన్ని కొన్నిరోజులు అనుభవించకుండా ఉంటే త్వరలో ఆనందాన్ని పొందగలవు.
8. మాయాశక్తులు కాకుండుటకు తృష్ణ, ఆశలను తొలగించుకోవాలి.

**7-9-76**

1. ఆశయే దరిద్రము.
2. ఆత్మానాత్మ విచారము చేయకపోవడం, ఇంద్రియసుఖాల మీద ఆశ కలిగివుండటం కూడా అసురుల లక్షణాలే.

**8-9-76**

1. దుష్టపు అలవాట్లు పూర్తిగా నశింపచేయాలి. లేకుంటే వేరే దుష్ట బుద్ధులు మొదట దానినుంచి వస్తాయి.
2. వైరాగ్యమే అభయము.
3. రాగము:- మాయా జనితములై, లేకున్నా ఉన్నట్లు అనుపించువాటిని అనుభవించాలన్న కోరిక.
4. మనస్సును ధర్మమైన పనులలో నిమగ్నం చేయాలి.
5. మనస్సు, శరీరము, ఇంద్రియాలు నిష్కపటంగా ఉపయోగించాలి.



6. అసత్యం వలన మిగతా ధ్యానవిషయాలన్నీ చెడిపోతాయి.
7. మోక్షానికి పనికిరాని ఎటువంటి పనైనా విడవాలి.
8. పనికిరాని వాటిపై ఇష్టాన్ని (ధ్యానపూర్వకంగా) మనస్సులో నశింపచేయడమే సాధన.
9. మనస్సులో దుష్ట తలంపులయందు సహజంగా ఉండాలి.

**9-9-76**

"నీ దృష్టి ఎక్కడపడితే అక్కడనేనున్నాను (సాయిబాబా)

**14-9-76**

శ్రవణ మననాదులతో సహ నిధి ధ్యాసలుండాలి.

**7-10-76**

స్థిత ప్రజ్ఞుని లక్షణము - న అభినందంతిన ద్వేష్ఠి

**27-11-76**

1. ఎవరిమీద అతిగా మమకారం ఉండరాదు.
2. అగ్నిచే ఆకర్షింపబడిన మిడుత దానిలోనే బడి నశించునట్లు ఆభరణాలు ధరించిన స్త్రీచే ఆకర్షింపబడి పురుషులు నశించుచున్నారు.
3. నేనెవరు? అని ఆలోచించటమే ఆత్మ ప్రదక్షిణం.
4. 'నేను' ను చూడడం వలన వైరాగ్యం, ఒంటిరిగా వుండాలన్న కోరిక కలుగుతాయి.

**30-11-76**

1. అజ్ఞానము నశించిన తక్షణమే జ్ఞానోదయం కలుగుతుంది.
2. ధ్యానంలో మాత్రమే జ్ఞానం పొందియుండుట కొన్ని రోజులుండును.

3. ప్రతి ఆలోచన వచ్చినపుడల్లా 'నేను పరిమితుడును' అన్న భావం మరోసారి వస్తూనే వుంటుంందది.
4. Thaught less ness గురించి ఆలోచించాలి.
5. కరెక్టుగా 'నేను' ను చూచినపుడు బ్రహ్మజ్ఞానంతో నిండి వుంటాము.
6. దినంలో అనేకసార్లుగా 'నేను' ను చూడడంకన్నా ఒకేసారి అంతకాలము 'నేను' ను చూడడం ఎక్కువ ఫలవంతము
7. సత్వగుణం కలిగినపుడు దానిని బాగా వినియోగించుకుంటే సత్వగుణం బాగా అభివృద్ధి చెంది మిగిలిన గుణాలు నశిస్తాయి.
8. అత్యవసరమైతే తప్ప సంభాషణలో పాల్గొనరాదు.
9. నామజపం కన్నా "ఇప్పుడును" చూడడం ఎక్కువ విశిష్టమైనది.
10. బాబాకు బాబా పటానికి ఏ బేధములేదని బాబా ఇచ్చిన నిదర్శనాలు గుర్తు తెచ్చుకొని ఆలోచిస్తూంటే చాలు.
11. మనిషికి తాను సంసారంలో పడిపోకుండా తాను ఆత్మయేనని తెలుసుకోవడానికి పూర్తి స్వేచ్ఛవుంది.
12. మనస్సు ఉత్పన్నమయ్యే చోటును వెతికితే మనస్సు ఆత్మయొక్క రూపాంతరమేనని తెలుస్తుంది.
13. కోరికలు అనే అగ్నిలో మిడతలవలె కాలిపోతున్నాము.
14. దుఃఖము గూర్చి ఆలోచిస్తే వైరాగ్యము కలుగుతుంది.
15. ప్రాణాయామం వలన మనస్సు సూక్ష్మరూపం ధరించి దాని సామర్థ్యం పెరుగుతుంది.
16. ఎన్నిసార్లు పలికినా నూతనంగా అనుభవించడమే భజన.



17. 'నేను పరిమితుడను' అన్న ఎండమావిలోని నీటి తరంగాలే సుఖదుఃఖాలు.
18. మెలుకువలో మెలుకువను అనుభవించే దాన్ని చూడాలి.
19. నేను ఒక వ్యక్తి అనే భావం పుట్టేది ఎక్కడో చూడాలి.
20. ఉండుట అనే స్థితి ఆత్మస్థితి.

## 6-11-76

1. రమణవాణిలో భగవాన్ ఒక భక్తునితో "ఓరినందా! భయపడకు. నీవు నన్ను వదిలినా నేను నిన్ను వదలను 'సంతోషంగా పో! అన్నారు.
2. కామ క్రోదాదులే మనకు శత్రువులు. ఇవి ఎట్లా తలెత్తుతున్నాయి, యిష్టాయిష్టాలే కామక్రోదాదులుగా మారుతున్నాయి. అయితే స్వయంగా మనోవికారాలు ఎవరికి అని ప్రశ్నించుకోవాలి. ఇట్లా నిరంతరం ప్రశ్నించుకుంటే ఆత్మదర్శనం అవుతుంది. అపుడు వ్యామోహాలు ఉండవు. (రమణ భగవాన్)

## 27-12-76

1. 'నేను'ను చూడటం అలవాటులేక శ్రమ అనిపిస్తుంది.
2. మనం చూచేవన్నీ బయటనుంచి మనకంటిపొరమీద పడే ప్రతిబింబాలే (ఏది నిజం)
3. "బయటినుంచి" అని చెప్పేది కూడా ఇంద్రియానుభవమే. కలలోని రూపాలన్నీ మనస్సు ధరించేవే. కాని అట్లా అనిపించదు. అట్లానే ఈ జగత్తంతా మానసిక స్థితే. ఎవరిని గూర్చి చాపల్యతను పొందే పనిలేదు.

## 22-1-77

1. ఒకప్పుడు చక్కని వివేక వైరాగ్యాలు భక్తి కలిగివున్న నేను ఈనాడు ఎందుకు దిగజారాను? అని భక్తినుంచి మనస్సు విముఖత చెందినపుడు ప్రశ్నించుకోవాలి.
2. అన్ని కర్మల కన్నా మనస్సుతో చేసే కర్మలు బలమైనవి. కారణం మనస్సు ఎట్లా చింతిస్తూవుంటుందో అట్లాంటి జన్మలు వస్తాయి.
3. సామాన్యంగా 100కి 90మంది కనీసంగా అయితే 7 జన్మల కర్మను, ఎక్కువైతే వందల జన్మల కర్మల వరకు ఒక జన్మలోనే అనుభవిస్తూంటారు.
4. మానసిక బలహీనతలు ఉండేవాడు తనవట్ల తానే శత్రుత్వభావన కలిగి తన మనోభావాలను పనులను గమనించుకోవాలి. అంటే తనవట్ల తానే శత్రువుగా వ్యవహరించాలి.
5. ఏ పనిమైన చేయుటకు వెళ్ళేటప్పుడు ముందు బాబాకు నమస్కరించి 'సాయిబాబా భక్తుడైన నేను ఈ పనికోసం వెళ్తున్నాను. (ఈ పనిని చేయబోవుచున్నాను) అన్న భావంతో బయలుదేరి ఆ కార్యసాధనలో తప్పటడుగు వేయకుండా వుండాలి. పొరపాటున తప్పటడుగు వేసినా పై విధంగా జ్ఞప్తికి తెచ్చుకోవాలి.

## 24-1-77

1. సాధనకు పనికి వచ్చే పనులు సాధకుడు తప్పక ఆచరించాలి. ధర్మబద్ధం కానివి ఆచరించకూడదు.
2. ధర్మ ప్రవర్తన వల్ల పూర్వ పాపాలు నశిస్తాయి.



3. దొంగతనం చేసేటప్పుడు అందరి ఎదుట పెద్ద మనిషి వలె నటిస్తే అది కూడా ఒక పాపం అవుతుంది. మొత్తం రెండు పాపాలు.
   1. దొంగతనం 2. చేయనట్లు నటించడం
4. ఏ పనిలోనైనా సమభావం అవసరం
5. సమభావం వివేక వైరాగ్యాల ద్వారా వస్తుంది.
6. భగవంతుడు మన హృదయాన్ని చూస్తాడు. అంటే మన మనస్సులో ఏముందో ఒంటరిగా ఉన్నప్పుడు ఏం చేస్తుంటాడో చూస్తూవుంటాడు.
7. అందువల్ల లోపలికి ఒకటి, పైకి ఒకటి పెట్టుకుంటే లాభం లేదు.
8. అన్యమైన వాటిలో ఏమిలేదని వివేక వైరాగ్యాలతో 'ఏదినిజం' లో మాదిరి యోచిస్తే భక్తి పెంపొందును.
9. భగవత్ప్రీత్యర్థము చేసేపనులు (దాన ధర్మాలు మొదలైనవి), భగవంతుని చూస్తూ చేసే పనులు మోక్ష హేతువులు.
10. ఇదంతా లేకున్నా ఉన్నట్లు కనిపిస్తుంది అనే భావంతో నిష్కామంగా స్వధర్మం ఆచరించాలి.
11. ఏ బలహీనత ఎక్కువ ప్రభలంగా వుంటే దానిని వివేక వైరాగ్యాలతో ఇదంతా భ్రాంతి అన్న భావంతో నశింపచేయాలి. మొదట జయించవలసినది దీన్నే.

## 25-1-77

1. నలుగురిలో ఉంటే మన ఉపాసన పోయేటట్లైతే సాధన చేయవలసినంత చేయలేదని అర్థము.
2. ప్రతికూల పరిస్థితుల నుంచి తప్పించుకోవటం ప్రతిసారి సాధ్యంకాదు కాబట్టి, నిలబడి సాధనను నిలబెట్టుకోవడం కూడా సాధ్యం కాగలగాలి.

3. ఇంతవరకు మునుపు మనకు ద్రోహం చేసిన వానిపై వాణ్ణి చూడగానే కోపంగాని, వాడుచేసిన ద్రోహంగాని జ్ఞాపకం వస్తే ధ్యానం సరిగ్గా జరగడంలేదని భావం.
4. పై విషయాలు జ్ఞాపకం చేసుకోవాల్సిన అవసరం లేనంత తీవ్రంగా ధ్యానం జరగాలి.
5. ఏ పని చేయాల్సివచ్చినా అది అయిపోగానే ధ్యానంలోకి పోగలగాలి.

**28-1-77**

1. పనులు చేసేటప్పుడు శ్రద్ధతో చేస్తూవుంటే మనస్సు "ఇపుడు" (Presentense) లో ఉంటుంది. నడుస్తున్నా శ్రద్ధతో నడిస్తే ఆత్మనుంచి మనస్సు చెదరనట్లే.
2. కర్మయొక్క ఫలితం ఆశించడం అల్పము మరియు హీనము.
3. అనవసరమైన దానిని తగిలించుకోక చేయవలసిన Duty తప్పక చేయవలయును.
4. వివేక వైరాగ్యాలు లేకుంటే క్రమంగా నాశనమౌతూనే ఉంటాము.
5. వివేక వైరాగ్యాలు లేకుంటే సాధన జరగనే జరగదు.
6. సమస్త కోరికలను జయించినవాడు - స్థిత ప్రజ్ఞుడు.
7. మనస్సు ప్రక్కదారి పట్టే సన్నివేశాలు తటస్థపడకుండా చూచుకోవాలి. (జాగ్రత్త పడాలి)
8. హృదయంలోని ఆనందాన్ని అనుభవించేందుకు మనకు గల కోరికలే ఆటంకాలు.

**29-1-77**

1. స్థిత ప్రజ్ఞుని గుణాలను ఇంద్రియాలకు లోనుగాని స్థితిని రోజు ధ్యానించాలి.



2. ఊరుకున్నపుడల్లా మనస్సును ఆత్మవైపుకు త్రిప్పుతూ వుండాలి.
3. విసుగుపుడితే ఎవరికి విసుగు అని ధ్యానించాలి.
4. ఆత్మను దర్శిస్తే గాని వాసనలు నశించవు.
5. వివేక వైరాగ్యాలతో చాపల్యాలకు లొంగకుండా ఉంటే క్రమంగా ఇష్టాన్ని జయించవచ్చును.
6. ధ్యానం చేసే ముందు వివేక వైరాగ్యాలతో కొంతసేపు ఆలోచించి పిదప ధ్యానం చేయాలి. అపుడు ధ్యానం బాగా జరుగును.
7. అత్యవసరమైతే తప్ప మాట్లాడకపోవడం (మౌనం), ఆకలివేస్తే తప్ప తినకపోవడం ఉపవాసంతో సమానం.
8. అనవసర వస్తువులు జ్ఞాపకం రావడం, ఇంద్రియ నిగ్రహం లేకపోవడం వుంటే వివేక బుద్ధి కలుగదు.
9. ఆత్మచింతన లేనివానికి శాంతి లభించదు.

**30-1-77**

1. ఇంద్రియాలను నిగ్రహించి మనస్సులో అవి రాకుండా ఉండేందుకు మనస్సును ఖాళీగా వుంచరాదు.
2. ఇంద్రియాలలో ఏది ఎక్కువ బలమైనదో అది మనిషిని హరించివేయును.
3. మనస్సును వివేకముతో ఉంచుకొని ఇంద్రియాలను Control లో ఉంచుకోవాలి.
4. తెలిసికూడా నిర్లక్ష్యంగా వుండి ఇంద్రియాలను పనిచేయిస్తే వాటికి బలం ఎక్కువ అవుతుంది.
5. ఇంద్రియాలను విషయాలపైకి పోనివ్వని వాని జ్ఞానం స్థిరమైనది.

6. ఇంద్రియాలను సర్వవిధాల అరికట్టాలి.
7. ఇంద్రియ నిగ్రహం లేని వానికి భగవద్దర్శనం కాదు.
8. నడిచేటప్పుడు నడవడాన్ని, గుర్తించేదాన్ని చూస్తూవుంటే ఇంద్రియాలు పనిచేయవు.
9. సమస్త కోరికలను జయించి, అహంకార మమకారాన్ని జయించిన వానికే జ్ఞానం సులభసాధ్యం.
10. కోరికలను, విషయాలను త్యజించుట, కోరికలపై ఇష్టం లేకపోవుట, అహంకారాన్ని విసర్జించుట, మమకారాన్ని పారద్రోలుట అను నాలుగు సాధనలు ఉన్నది.

### 31-1-77

1. సాధన చేయడం తగ్గితే గురువులో లోపాలు కనిపిస్తూంటాయి.
2. ఆత్మవంచన వుంటే ఆత్మజ్ఞానం దుస్సాధ్యం.
3. మనలో ఉండే గుణాలు సత్సంగములో ఉదాహరణలుగా వస్తుంటాయి.
4. ఒక్కసారి మొదట నుండి ఉండిన విశ్వాసం పోయి అవిశ్వాసం కలిగితే అప్పటివరకు చేసిన సాధన నశిస్తుంది.

### 1-2-77

1. వివేక వైరాగ్యాల ద్వారా మనస్సుతో ఇంద్రియాలను జయించినవాడు కర్మయోగిగా మారతాడు.
2. తన ధర్మాన్ని ఉల్లంఘించే వాడికి ముక్తి అసాధ్యం.

### 2-2-77

1. ఎప్పుడూ తనకు గాని ఇతరులకు గాని ఉపయోగకరములైన పనులు చేస్తూండాలి. మనస్సును ఊరకనే ఉంచరాదు.



2. లౌకిక భావం లేకపోవడమే ధ్యానం చేయడం.
3. నిష్కామకర్మ చేస్తే చిత్తం నిర్మలమవుతుంది. ఏ పనీ చేయకుంటే ఇతర చెడ్డ తలంపులు వస్తూంటాయి.

### 4-2-77

1. సాధన యందు అజాగ్రత్త ఉంటే ఇంద్రియాలు మనల్ని చలింపచేస్తాయి.
2. మనం చేసే పనులన్నీ సత్వరజస్తమో గుణాల వల్ల మనలో కలుగుతాయి. మన కర్తృత్వం లేదు.
3. కర్మలయందు ఆసక్తి కలిగి ఉండి కర్మలను చేసినచో వాడు పతనమై భయంకర సంసారమనెడి ప్రవాహంలో కొట్టుకుపోవును.
4. వేదాంత గ్రంథాల మీద విసుగుపుడితే వాడు సంసారంలో తగులుకున్నట్లే

### 8-2-77

1. కర్తృత్వము, ఫలాపేక్ష లేకుండా చేసే కర్మ అకర్మ అవుతుంది.
2. పని చేసేది ప్రకృతే గాని ఆత్మస్వరూపుడను (సాక్షిని) అయిన నేను కాదు అని తెలుసుకోవాలి. అంటే పనులు చేసేటప్పుడు చేస్తున్నట్లు తెలుస్తున్న అనుభవాన్ని గుర్తిస్తూ వుండాలి.

### 9-2-77

1. ఆత్మనిష్ఠ కూడా యజ్ఞమే. శరీరమన్న భ్రాంతిని ఆత్మలో ఆహుతి చేస్తాడు.
2. సమస్త కర్మలను యజ్ఞభావంగా చేస్తే మనస్సుకు చంచలత్వం తగ్గుతుంది.

3. గురువు వాక్యాలపై దైవభావాలు కలిగి ఉండటం దైవయజ్ఞము.
4. సాధనలో రోజంతా వుండకుంటే మిగిలిన దుష్టభావాలు ధ్యానం చేయాలన్న కోరికను నశింప చేయును.
5. ఏ పనినైనా చేయబోయే ముందు యజ్ఞంగా భావించాలి.

**11-2-77**

1. శిష్యుడిపై గురుదేవుని కృపలేకుంటే శిష్యుడు ఒక్క అడుగు అయినా ఆధ్యాత్మికంగా ముందుకు పోలేడు.
2. వినయంతో సేవచేయాలి.
3. శ్రద్ధ, నిష్టలు కుదుర్చుకోవటానికే ముక్తి మార్గంలో సాఫల్యత పొందేందుకు పట్టేకాలం.
4. ఆధ్యాత్మిక విషయాలలో సందేహం, అపనమ్మకం ఉండటం మహాపాపం.

**14-2-77**

1. మనము చేసిన పాపపు కర్మలన్నీ మనల్ని కట్టికుడుపుతాయని నమ్మకం ఎంత ఉంటే సాధనమీద ఇష్టం అంత ఉంటుంది.
2. సాధనపైగల 'పట్టు' జారకుండా చూసుకోవాలి.
3. మనం ఇంట్లాంటి పనిచేస్తే వచ్చే ఫలితం ఏమిటి అని ప్రశ్నించు కోవాలి.
4. మనస్సు ఎపుడు దిగజారుతుందో అని సావధానంగా ఉండాలి.
5. కర్మలగూర్చి, జన్మలగూర్చి, లౌకిక సుఖాల అశాశ్వతత్వాన్ని గూర్చి, సాధన యొక్క ఔన్నత్యాన్ని గూర్చి, బాగా ఆలోచించాలి.



6. వివేక వైరాగ్యాలతో ఒకేసారి తీవ్రంగా ఆలోచించాలి మనవారికి అన్వయించుకుంటూ ఆలోచించి పూర్తిగా మమకారాలను, కోరికలను త్యజించి వేయడం చాలా ముఖ్యమైన విషయము.
7. సందేహం లేక పోవుటయే సంపూర్తిగా ఆలోచించుటకు గుర్తు.
8. ఏ ప్రయోజనము లేనిదానిని పూర్తిగా తిరస్కరించడం అలవాటు కావాలి.

**15-2-77**

1. దేనిని ద్వేషించని వాడు, కోరని వాడు సన్యాసి.
2. ద్వంద్వాలను సన్యసించాలి.
3. వాసనాక్షయమే సన్యాసం
4. వివేక వైరాగ్యాలతో రాగద్వేషాలను జయించటమే సన్యాసం.
5. రాగద్వేషాలు "నేను అన్యం" అనే భావాన్ని (ద్వందాన్ని) పెంచుతుంటాయి.
6. ధృక్ రూప ఆత్మను ఎల్ల వేళలలోను ధ్యానించడం వీలుకాదు కాబట్టి ధ్యానించిన పిదప నిష్కామ కర్మలను ఆచరించ వలెను.
7. ఇట్లా చేస్తే కొంతకాలానికి Continueగా చేయగలుగుతాము.
8. నిష్కామకర్మ, సగుణధ్యానము,నిర్గుణధ్యానము అన్నీ ఒకదాని పిదప ఒకటి చేస్తూనే ఉండాలి.

**16-2-77 శివరాత్రి**

గురువు ఆజ్ఞానుసారము ప్రవర్తించడమే గురుసేవ.

**18-2-77**

1. ఎంతో పనులలో వుండి ధ్యానానికి సమయం లేకుంటే

వీలైనపుడు 5నిమిషములు అయినా ధ్యానం చేయుకుంటే ఇంద్రియాలలోంచి పనికిమాలిన భావాలు కలుగుతాయి. పని అయిపోయిన వెంటనే 'నేను' ను చూడడం (ధ్యానం) లో వుండి పోవాలి.

2. ఫలాపేక్ష వదలడం శాంతిని పొందడానికి అవశ్యకము.
3. ఇంద్రియ నిగ్రహము కలిగిన సాధకుడు నవద్వారములు (9) గల పట్టణములో హాయిగా వుండును.
4. మన సుఖాలపైన, మనకు రాగద్వేషాలు కలిగించే వాటిపైన, మనలను ఎక్కువగా పాడు చేసే వాటిపైన తీవ్రంగా ఆలోచించాలి.
5. ఇంద్రియాలను అనుభవించే కొద్ది వివేకంగా ఆలోచించాలన్న బుద్ధి పోతుంది.
6. ఇతర విషయములయందు ఆసక్తివుంటే సాధన కొనసాగదు.

**20-2-77**

1. తిరిగి తిరిగి ఆత్మను (నేనును) దర్శించేందుకు ప్రయత్నించాలి. ఇలా ప్రయత్నించడమే ఆత్మప్రదక్షిణ.
2. మేఘాలు, వర్షము, ఎండనుంచి పామునీడలో ఎలుక రక్షింపబడుట ఎంత అసాధ్యమో ఇంద్రియసుఖాలలో వుండే సుఖం కూడా అంతే ఉంటుంది. కనుక అంత ప్రమాదకరము.
3. మనస్సును బలవంతముగా వైరాగ్యములో వుంచుకుంటే కోరికలు పెరిగి, రాబోవు జన్మలలో పాపాలుచేసేందుకు వసతులు కలుగుతాయి. అందువలన హీనలగు మంద వైరాగ్యులు నాశనమవుతారు. కావున తీవ్రవైరాగ్యము సంతోషము అయిన మనః పూర్వకముగా ఉండవలెను.



**22-2-77**

1. "కనిపించే దృశ్యజగత్తు మొత్తము బ్రహ్మము" అన్న భావము అనుభవమయ్యే వరకు నిలుపుకోవాలి.
2. నవద్వారములు గల శరీరము నందలి మనము ఇంద్రియ నిగ్రహం ఉన్నప్పుడే సుఖంగా వుండగలం. ఇంద్రియాలకు లోనై ద్వారములు సరియైనవి కానిచో పురుషునకు (రాజుకు) సుఖము వుండదు.
3. మమకారము కలిగినపుడు - మమకారము పొందేదేదో చూడాలి.

**23-2-77**

1. సర్వము భగవన్మయము అన్న భావంతో లీనమవ్వటం వల్ల తక్కిన సర్వము మరచి పోవాలి.
2. ప్రయత్నించి వివేక వైరాగ్యాలు,నుంచుకుంటే సాధన అప్రయత్నంగా జరుగుతుంది.

**25-2-77**

1. సాధన మళ్ళీ చేయాల్సిరావడం తాను వేరు, జగత్తు వేరు అన్న భావాన్ని తాను శరీరము అన్న భావాన్ని వదలక పోవటమే.
2. వీటిని అనుభవిస్తే క్రమంగా వాటిపై వ్యామోహం పెరిగి ఆధ్యాత్మిక జీవితంపై అయిష్టం కలుగుతుంది.
3. లౌకిక సుఖాలు మెరుపు తీగలాగ ఒక క్షణకాలం సుఖంగా వున్నట్లు అనిపించిన వెంటనే (మెరుపుతీగ వచ్చి పోయాక మరింత అంధకారం ఏర్పడినట్లు) దుఃఖాన్ని కలిగిస్తాయి.
4. మనకు కలిగే కోరికలన్నీ ఇంద్రియ సుఖాలవలనే.

5. ఇంద్రియాలను మనస్సుతో జయించి ఆత్మపై మనస్సు నిలిపినవాడు ఋషి.
6. శిథిలమై పోవునదే శరీరము.
7. తాను వేరు అన్న భావాన్ని పెంచేవన్నీ అధర్మాలు.
8. ప్రక్కన ఏం జరుగుతుందో, ఏం మాట్లాడుతున్నారో విందాం, చూద్దాం అనే దోషాల వలననే ధ్యానం చెడుతుంది.

**26-1-77**

1. బ్రహ్మజ్ఞానమునకు యత్నించువాడు యతి అనబడును.
2. ఆత్మస్వరూపము యొక్క మననము, దృశ్యాలపై యివి మిథ్య అనేభావం కలిగి ఉండడం వలన కామక్రోధాలు జయించవచ్చు.
3. దినదినానికి సాక్షి రూపమును ఎక్కువకాలం గుర్తుంచుకుంటూ వుండాలి. ఖాళీగా ఉన్నపుడు దానిని అభ్యసించాలి.
4. మనకు గల సామర్థ్యమంతటితో 'నేనును' చూస్తూవుండాలి, ముక్తి ఎపుడో వస్తుంది అనే భావం ఉండకూడదు. యత్నిస్తే ఏక్షణంలోనైనా రాగలదు.
5. ప్రాణాయామం వల్ల మనస్సుకు ఏకాగ్రత పెరుగుతుంది.

**28-2-77**

1. వైరాగ్యము పూర్ణంగా వస్తే మోక్షము, సాక్షాత్కారము తప్పక కలుగుతుంది.
2. భూత అద్ధములో సూర్యుని కిరణాలను కేంద్రీకరిస్తే కాగితాన్ని అన్నీ కలిసి కాల్చివేస్తాయి. అదే విధంగా అనేక వాటిపై చెదిరిన మనస్సును భగవంతునిపై కేంద్రీకరిస్తే ఆత్మానుభవం అవుతుంది.



**5-3-77**

1. సర్వకాల సర్వావస్థలలోను భగవంతునిపై మనస్సు నిలిపినవాడు యోగులందరి కంటే ఉత్తముడు.
2. అశ్రద్ధతో ఏపని చేసినా సాధనలో (పూజ, ధ్యానం, జపాలు) వ్యర్థమే.

**8-3-77**

1. యవ్వనం అనే మదంతో వుండేవారు తన బలంపైన గర్వంతో "ఇంద్రియ సుఖాలు" అనే మొసలి చేత మింగబడెదరు. వృద్ధాప్యంలో దుఃఖం అనే త్రాళ్ళుచే కట్టబడెదరు.
2. వివేకం అనే పొడవైన తాడుతో సంసార సముద్రాన్ని దాటి వైరాగ్యం అనే గట్టు చేరాలి.

**9-3-77**

1. మనస్సులో కామ క్రోధాదులు నశించునపుడు మాత్రమే 'నేను పరిమితుడను' అన్న భావం నశించి సంపూర్ణ శరణు పొందగలడు.
2. ఇది లేనిది ఉన్నట్లు కన్పించేదేనని భావించడంవల్ల కామ క్రోధాదులు జయించాలి.
3. భగవంతుడు తనభక్తులకు దూడకు ఆవుపాలు ఇచ్చినట్లు వారి యొక్క కోరికలు తీరుస్తారు. లౌకికులు ఆవుకాళ్ళను బంధించి పాలుతీసుకొన్నట్లు భగవంతుడి నుంచి వరాలు పొందుతారు. (జ్ఞానేశ్వరి భగవద్గీత)
4. అనేక జన్మల సాధన ఫలితంగా సాధకుడికి " అంతా భగవంతుడే" అనే భావం కలుగుతుంది. కాబట్టి ఈజన్మలోనే అనేక కష్టాలు అయినా పడి ఆభావంతో ముక్తి పొందాలి.

5. "ఇదే మన చివరి జన్మ" అన్న భావంతో సాధన బలంగా చేయాలి.
6. "వాసుదేవుడు" అంటే అన్ని జీవులలో వ్యాపించి ఉండేవాడని అర్థము

**10-3-77 గురువారం**

1. ప్రపంచంలో స్వతంసిద్ధంగా దేనికి ఒక ధర్మంలేదు, అంతా మన ఇంద్రియ అనుభవమే, ఇష్టా ఇష్టాలే, అందువల్లనే ఒక్కొక్కడికి ఒక్కొక్క దానిపై విలువ ఉంటుంది. దీనిని బట్టి ప్రాపంచికమైన విషయాలకు, వస్తువులకుండే విలువ సహజమైన గుణం కాదని కేవలం వాడి ఇంద్రియానుభవమేనని తెలుస్తుంది.
2. లౌకిక సుఖాలకోసం మనిషి ఆరాటపడేది కూడా అధ్యాత్మికతలో పొందే అనందం కోసమే. కాని అనందం పొందే మార్గంతెలియక వేరే విధంగా పొందయత్నిస్తాడు. అంటే సర్వజీవులు ఆనందం కోసం ప్రయత్నించేవేనన్నమాట.

**11-3-77**

1. విరోచనానికి మందు పుచ్చుకొన్నవాడు ఇంటిలో వుండలేనట్లు, కోరికలు, ఇంద్రియ వ్యామోహాలు మొదలైనవి గల సాధకుడు ధ్యానంలో ఎక్కువసేపు వుండలేడు.
2. "ఈ దినం ఇంత నామజపం చేసే వరకు, ఇన్ని అధ్యాయాలు పారాయణ చేసే వరకు గాని లేవను" అని పట్టుబట్టి చేయాలి.
3. ప్రయాణమయి ఏదైనా ఊరికి వెళ్ళాల్సివస్తే కొన్ని దినములు ముందు నుండి అవసరమయిన వస్తువులను సమకూర్చుకొన్నట్లు. (అంతేకాని పోయేటప్పుడు అన్ని సర్దుకు



పోవాల్సివస్తే అపనిపూర్తిగా సమకూరదు) చిన్నప్పటినుంచి భక్తి కలిగి వుండి,ముసలి తనంలో కూడా భక్తి కలిగి వుంటే తప్ప భగవంతుడ్ని పొందలేము. ముసలి తనంలోనే భక్తి కలిగివుండాలి అనడం ఇందువల్ల సరైనదికాదు.

**18-3-77**

1. లౌకిక సుఖాల్లో ఏమి సుఖం లేదని తెలియడం వల్ల భ్రాంతి పోతుంది.
2. అక్షరమగు పరబ్రహ్మాన్ని బోధించడమే అక్షరాభ్యాసము.
3. ఇంద్రియ సుఖాలను వదలి, ఇంద్రియాలను శుష్కింపచేసి శరీర వృక్షమూలంలో కూర్చుని పరమాత్మను ధ్యానిస్తే వైరాగ్యము కలుగును.
4. భగవంతుని చింతన జరగకుంటే మాయవలన చిత్తం బలపడి లౌకిక విషయాల వైపుకు మనస్సును త్రిప్పివేయును.

**19-3-77**

స్నానం : నిర్గుణం,సగుణం అనే రెండు గురువు యొక్క రెండు పాదాలు. మనకు శరీర పరిమితుడన్న భావము, ఆత్మ అనే రెండు ఉంటాయి గదా! స్నానం అంటే వాటికి అభిషేకం అని గుర్తుపట్టాలి.

**21-3-77**

1. ఒక వాక్యమును వ్రాసి తిరిగి తుడిచివేస్తే వాక్యము పోయినా, దాని భావం మనస్సులోనుంచి పోనట్లు, ప్రళయం జరిగినా, ప్రపంచము బ్రహ్మయొక్క నిద్రాసమయంలో భావరూపంలో తప్పక ఉంటుంది.

2. ఎవని యందు ఈ సకల జగత్తు ఉన్నదో, ఎవడు ఈ జగత్తంతా వ్యాపించి ఉన్నాడో అట్టి పరమాత్మ అనన్యమగు భక్తి చేతనే పొందబడుతున్నాడు - భగవద్గీత.
3. మరణంలో శరీరం నుంచి పంచభూతాలు వెలువలి పంచభూతాలతో కలసిపోతాయి. మరణసమయంలో మనసు ప్రజ్ఞను కోల్పోయినపుడు కలత చెందనపుడు ఇంద్రియాలు స్థిమితంగా వుండును. ఆనమయంలో మనస్సులో బ్రహ్మచింతన చేస్తూ ప్రాణంవిడుస్తాడు.
4. ప్రాణాయామం అభ్యాసం వుంటే మరణ సమయంలో శరీరంలో ఉష్ణాన్ని ఉత్పత్తి చేస్తుంది. ఈ విధంగా ప్రాణాన్ని నిలబెట్టి బ్రహ్మను ధ్యానిస్తాడు.
5. అమావాస్య నాడు పుట్టిన వాడు దొంగ అయినా యోగి అయినా అవుతాడు.
6. శుక్లపక్షంలో ప్రాణాన్ని విడిస్తే ముక్తి పొందుతాడు. ఇదిపగటి పూట ఉత్తరాయణంలో లభిస్తుంది. చంద్రుడికి మనస్సుకు సంబంధం వుంది.

## 22-3-77

1. భగవంతుడిని వదిలి ఇంద్రియ సుఖాలను ఆశించడం మణిని వదిలి నత్త గుల్లను మెడలో కట్టు కోవడం లాంటిది.
2. వివేకము, జ్ఞానదృష్టిలోపించినపుడు నానాత్వము కనిపించును.
3. ఆకాశ తత్వాన్ని గూర్చి ఆలోచించినపుడు ఆలోచనలు (మనస్సు) ఆగిపోయి నిరామయం లభిస్తుంది. ఇది సాధనలో పైస్థితికి పోవడానికి అనుకూలమైనది.



4. రంగుల రాట్నంలో వలె జీవులు పుట్టుకచావులలో తిరుగుచున్నారు. రంగులరాట్నాన్ని నిలపటానికి త్రిప్పేవాడిని ఆశ్రయించినట్లు జన్మపరంపరలను తొలగించుటకు మాయకు ఆధారమైనవాడిని ఆశ్రయించాలి.
5. భగవంతుడిని శరీరంగా గుర్తిస్తుండటం అయనన్ను అవమానించడమే.
6. శరీరాన్నిచూస్తున్నా మనస్సులో "ఈయన సర్వవ్యాపకుడు" అను భావం కలిగినవాడు అదృష్టవంతుడు.
7. మనకు మనమంటే శరీరం అన్నభావం వున్నందున భగవంతుడిని శరీర రూపంగా భావిస్తాము.

## 21-4-77

1. దేనికైనా, ఏవిషయంలోనైనా సరే భావము లేదా ఉద్దేశ్యము ప్రధానంకాని బాహ్యక్రియలు కాదు.
2. అర్హుడు అయిన శిష్యుడు వస్తే, గురువు వసంతఋతువు వస్తే కోయిల కూసినట్లు వానికి ఉపదేశించి బోధించును.
3. పరమాత్మయగు బాబాయందు అనన్యమైన భక్తివుంటే ఆకాశంనుండి జారిన వర్షపుచినుకు వేరే ఆధారములేక భూమిని చేరేవరకు ఎక్కడా నిలవదో అదేవిధంగా అయనను (పరమాత్మను) చేరుటకు తప్ప, ప్రక్కకు పోవుటకు వీలులేదు.
4. రణపాల వృక్షాన్ని పూర్తిగా నరకకుంటే మరలా చిగిర్చి కొమ్మలు పెట్టినట్లు, సంసార వృక్షమును పూర్తిగా నరకనిచో తిరిగి చిగిర్చి కొమ్మలు వేయుట జరుగును.

**2-5-77**

1. జీవుడు, దేవుడు వేరుకాదు. దేవునిలో భాగమే జీవుడు.
2. స్వప్నంలో మనకు వున్నట్టుండి ఎవరో కొట్టినట్లు, పులి మీద పడ్డట్లుంటుంది. అపుడు భయపడి ఎట్లా మెలకువ వస్తుందో అలానే ఈ క్షణంలోనే తీవ్రాతితీవ్రంగా 'నేను'ను చూస్తే ఈ అజ్ఞానం అనే స్వప్నం నుంచి మేల్కొనుట సంభవించును.
3. ఆహారం తినునపుడు "ఏదినిజం" లో ప్రకారము అన్ని రూపాలలోను కూర రూపంలోను, పచ్చడిరూపంలోను ఇలా అన్ని రూపాలలోను ఒకే ఒక శక్తివుంటూ అదే మనలోను వుండి ఆహారమును జీర్ణంపచేయుచున్నది అని గుర్తిస్తూ ఆహారం తింటూ వుంటే జిహ్వాచావల్యం క్రమంగా నశించిపోతుంది. ఈ రుచి నోటినుంచి గొంతు వరకు మాత్రమేనని పూర్తిగా జ్ఞప్తియందుంచుకొని తినాలి.
4. ఆహారమును తన రుచి కొరకు గాని తను జీవించుటకు గాని తినువాడు పావమును (అమేధ్యమును) తినినవాడగుచున్నాడు. అలాగాక యజ్ఞరూపంగా గుర్తించి తినువాడు పరమాత్మనే పొందుచున్నాడు.

**4-5-77**

1. సాధన చేయాలనిపించడం మరలా అదేక్షణంలో ఇష్టం ఉండక పోవడం ఆహారం దోషంవల్లకాని, చెడు స్నేహంవల్లకాని, వివేక వైరాగ్యాలతో ఆలోచించనందువల్లకాని వస్తుంది. ఈ సమయంలో 'నేను' ను చూడడం సులువు. ఇదీ సాధ్యం కాకుంటే పవిత్ర గ్రంథపఠనం లేక వ్యాయామం, బాగా వేగంగా నడవడం, ప్రాణాయామం చేయడం వల్ల నిరోధించవచ్చు.



2. కామ, క్రోధ, లోభాలనే మూడు దుర్గుణాలు నరక ద్వారాలు. ఈ మూడు కలవారికి నరక ద్వారములు తెరువబడి వుండును.
3. రజోగుణము కలవాడు పులుపు, కారము మొదలగునవి మూతి (నోరు) చుట్టలు పెట్టి అయినా తింటాడు కానిఊరకుండడు.
4. ముముక్షువులకు రజోగుణానిచ్చే ఆహారములు నిషిద్ధములు. తినినచో చాలా బాధపడుదురు.

**5-5-77**

1. గుణాలను జయించుటే సాధన. 'నేను' అనేది అందరిలోను (ఒకే విద్యుత్ ఒక్కొక్క పరికరములో నుంచి ఒక్కొక్క విధంగా పనిచేసినట్లు) వుంటుంది.
"నేను నీలో వున్నాను, నీవు నాలో వున్నావు" అన్న బాబా వాక్యం కూడా ఇదే బోధించును.
2. మనస్సును త్రిగుణాలకు లోనుగానీయక స్థిరమయిన బుద్ధికలిగి సమానవేగంతో పయనించే వాహనములాగా అన్ని బాధలను, సుఖాలను ఎదుర్కుంటూ ఒకే తీవ్రతతో కొనసాగించే దశవరకు రావడం చాలా గొప్పవిషయం. అపుడు అటువంటివాడు సాధనలో ఒక దశకు వచ్చినట్లే.
3. అంతటా ఆయన ఉన్నాడు అన్న తత్వచింతన వలన మనస్సు నిశ్చలంగా స్థిరంగా ఉంటుంది. పిపీలికా మార్గాన్ని విడిచి విహంగ మార్గాన్ని చేపట్టడం సాధకుడికి అవసరం. అంతటా ఆయన ఉన్నాడు అనేది నోటిమాటగా కాక అత్మయందు నిరంతర ఎరుక ఉంటే అంతా సమకూరినట్లే.

**7-5-77**

1. వివేకంతో ఫలితాన్ని ఆలోచించక చేసే పనికిమాలిన పనులు తామస ప్రక్రియలు.
2. జీవితంలో ఏ గుణాన్ని ఎక్కువగా ఉపయోగిస్తాడో దానికనుగుణమైన జీవితాన్ని వచ్చే జన్మలో పుడతాడు. (ప్రజలను పీడిస్తే పీడించబడే వాడిలా పుడతాడు)
3. జయాపజయముల యందు సమభావం ఉండడం, చేసిన కర్మలకు ఎట్లాంటి ఫలితం వచ్చినా అనుభవించడం సత్వగుణప్రధానమైనవి.
4. మనకు ఒక వస్తువుతో పని అయ్యాక అది ఊరకే ఇంట్లో ఉండడం కంటే ఇతరులకు ఇచ్చివేయడం అలవాటు చేస్తే వస్తువు మన దగ్గర ఉండడం మీద బుద్ధి పోతుంది.
5. తాను సాక్షి స్వరూపమగు ఆత్మస్వరూపియని ఈ జగత్తంతా మిధ్యాభూతమని తెలుసుకొని బాధలకు, మానావమానాలకు చలించకుండా నిలబడగల స్థిరత్వం సంపాదించుకోవాలి.
6. బలహీనతలకు గురికాకుండా, గురికావడానికి వీలులేకుండా వుండే విధంగా ప్రతి పనినీ తీర్చుకొంటాడు సత్వగుణుడు. ఉదాహరణకి స్త్రీ వ్యామోహం వుండేవాడు బజారుకు వెళ్ళేటప్పుడు అందరిని, అన్నింటిని బాబా రూపంగా చూడడం, లేకుంటే బాబా నామం చేసుకొంటూ తలవంచుకొని నడవడం అలవాటు చేసుకోవాలి.

**8-5-77**

1. నాలుగు జానలు దూరానికి మించి చూడకుండా నడవడం సనకసనందనాదులకు సైతము అవసరమైనది.



2. ఈ ముల్లోకాలలో కావలసినది ఆయనకు ఏమి లేనందున సాయి ఆ వేషంలో ఉంటారు.
3. ఒక్కొక్కడు అనుభవించే బాధకు (ఈ జన్మలో) పూర్వ జన్మలలో చేసిన పనులే కారణం. అంటే రూపాన్ని దుర్వినియోగం చేసుకొన్నవాడు అంధవికారమైన జన్మనెత్తును. అలాగే ఈ జన్మలో మనం దేనిని ఎక్కువగా అనుభవిస్తే వచ్చే జన్మలో దానిని ఎక్కువగా నష్టపోతాము.
4. ధర్మవిరుద్ధంగా ఒక్కక్షణం పొందే సుఖం బాగావున్నా జీవితంలో మిగిలిన కాలంలో ఆ తరువాతి జన్మలలో పర్యవసానంగా పడే బాధలు అత్యధికం.
5. ఎవడు తన శరీరములోని దేన్ని దుర్వినియోగం చేస్తే వచ్చే జన్మలో దానికి దెబ్బతగులుతుంది.

**14-5-78**

ఈ జగత్తుండటం చివరకు మన దేహంవుండటం కూడా ఒక్కక్షణం క్రిందటవున్న దాని Effect మాత్రమేకాని ఈ క్షణంలో దానియొక్క నిజతత్వం కాదు మనకు అనుభవమయ్యేది. అనగా నిజంగావున్న దానిని కాదు మనం చూచేది, అనుభవించేది. ఉదా॥ స్వప్నంలో ఒకే నామ రూపరహితమైన మనస్సు "నేను ఒక వ్యక్తిగా వున్నాను" అనుకొనబట్టి తక్కిన నామరూపాత్మకమైన జగత్తు లేకున్నా (నిజంగా మెలుకువ దృష్ట్యా) వున్నట్లు అనుభవమయ్యేది. అనగా ఇప్పటి మన అన్ని అనుభవాలు అంతే. ఇందులో సందేహం లేదు.

భౌతిక జగత్తంతా మన ఇంద్రియానుభవమేనని,

అనుభవాలన్నీ భావాలని, భావాలు యదార్థాలు కావని తెలుసుకోవటం ద్వారా వివేక వైరాగ్యాలను అభివృద్ధి చేసికొనవచ్చని చెప్పుటవలన ధ్యానం తీవ్రంగా చేయుటకు సాధ్యమైనది.

**15-5-78**

1. ముక్తిపొందుటకు అవసరమైన పనిచేయని ఆస్తికుడు సహితం నాస్తికుడే.
2. "శ్రోతవ్యో మంతవ్యోనిదిధ్యాసనః

**I.** శ్రవణం:- సకలవిధాల వున్నది బ్రహ్మమే అని తెలుసుకోవడం, ఈ కనిపించే దానికి ఆధారం భగవంతుడని తెలుసుకోవడం, సంశయములు అంతరించేవరకు తెలుసుకోవడాన్ని శ్రవణం అంటారు.

**II.** మననం: వినిన విషయాన్ని తన జీవితానికి అన్వయించుకోవడాన్ని మననం అంటారు. ఈ మననం లేనప్పుడు సాధన దెబ్బతింటుంది. అప్పుడు మననం అవసరం.

**III.** ఒక్క ఆత్మకు గల వివిధ లక్షణాలను మానసిక స్థితిని బట్టి ఆలోచించడాన్ని నిదిధ్యాసనం అంటారు. ఈ నిదిధ్యాసనంలో మనసు ఒక కోణంలోంచి ఆధ్యాత్మిక చింతన చేయాలి. మనస్సు వివిధ కోణాలలోకి పరిగెత్తకూడదు. ఇట్లా చింతన చేయగా ఏ కోణంలోంచి ఆలోచించినా ఒకే విషయాన్ని చింతించగలమని తెలుస్తుంది. ఈ నిది ధ్యాసనం లేనివాడికి అవిద్య నశించదు.



3. యత్నంతో తాను శరీరపరిమితుడను అన్నభావం మరవడం నిదిధ్యాసనం.
4. అలవాటు మూలంగా ప్రయత్నం లేకుండానే మనస్సు ధ్యానస్థ కావడం నిర్వికల్ప సమాధి. 'నిర్వికల్ప' అంటే యత్నం లేకుండా అని అర్థం.
5. మనలోని జీవన్ముక్తుడిని చూపగలిగే పుణ్యవాసనలన్నీ కలసి మనకు ముక్తుడి రూపం మనముందర సంచరించేలా చేస్తాయి. అయితే అప్పటి మన వివేకముతో ముక్తుడిని సాధనకు నియోగించవలసిన బాధ్యతమనది.
6. తత్త్వమసి: నీవు ఈశ్వరుడువైయున్నావు.
7. శ్రద్ధ, వినయంలేని సాధకుడు తనకు తెలిసిన ఆధ్యాత్మిక విషయాలనుకు తర్కానికి వినియోగిస్తాడు.

**16 - 5 - 78**

1. నేను శరీరమనే భావన జ్ఞానాన్ని మూసివేస్తుంది. జన్మలకు కారణమవుతుంది.
2. ముక్తి పొందుటకు మాత్రమే శరీరము అవసరము. అందువలన శరీరాన్ని అలంకరించడానికి కాలము వృథా చేయకూడదు.
3. విషయ చింతన, విషయ ప్రవృత్తి, విషయభోగం వీటి మూడింటిని నశింపచేయాలి.
4. అన్నింటినీ అన్ని రకాలు అంతాబ్రహ్మమే అన్న భావనతో చూస్తే బ్రహ్మభావన బలపడి పైన చెప్పిన విషయచింతన, విషయ ప్రవృత్తి, విషయ భోగం అనే మూడు నశిస్తాయి.

**4-6-78**

1. భగవత్ప్రీత్యర్థం చేయాలి కాబట్టి త్రికరణ శుద్ధిగా కర్మలు నిర్వహించడాన్ని, ఫలాసక్తి లేకుండా చేసే కర్మను నిష్కామకర్మ అంటారు.
2. స్వప్రయోజనం కోసం చేసే హింస పాపకార్యము.

**6-6-78**

సత్ అంటే సర్వకాల సర్వావస్థలలోను మార్పులేనిది.
జ్ఞాన స్వరూపము - తెలుసుకుంటూవుంటుంది.
అనంతము అయినది బ్రహ్మము.
సత్యము - నాశనము లేనిది.
వార్తాలాపము - బిక్షుల లక్షణాలు
కపాలం వృక్షమూలాని కు చైలమ సహాయః
ఉపేక్ష సర్వభూతానాం ఏతవద్భిక్షు లక్షనం॥

చేతిలో మట్టికుండ, చెట్టుక్రింద నివాసము, జీర్ణవస్త్రాలు, ఇతరుల సహాయము స్వీకరించకపోవుట, సర్వప్రాణులయందు ఉపేక్షభావము - ఇవి బిక్షుని లక్షణాలు.

**30-8-81**

1. సౌందర్యం మనభావమే కాని నిజానికి వుండదు.
2. ఆత్మజ్ఞానం రాకముందే ధృడమైన తత్వజ్ఞానం ద్వారా వైరాగ్యాన్ని పొందాలి. అట్లాగైతేనే ఆత్మజ్ఞానం వస్తుంది.
3. ధర్మంగా అర్జించి కోరికలు తీర్చుకుంటే వాసనాక్షయము జరుగుతుంది. వైరాగ్యం ఏర్పడి ఏకభావంలో నిలుస్తుంది మనస్సు.
4. అకురాయి చక్రం వద్ద పదునుపట్టేటపుడు సరిగ్గా



పదునుపట్టాల్సిన చోట అకురాయికి తగిలేటట్లు చేసినట్లు, వాసనలు తత్వజ్ఞానంలో అరగదీయాలి.

5. ఉపరతిః లౌకిక విషయాలను మానసికంగాను, భౌతికంగాను త్యజించుట.
6. ఆశ్రమాలలో గృహస్థాశ్రమము శ్రేష్టమైనది.

**31-8-81**

1. అవిద్యాబంధము నుండి విడివడుటకు ప్రయత్నించక రేపు కాకి మొదలగు పక్షుల వాటికి అహారమగు ఈ శరీరమును పోషించువాడు ఆత్మఘాతకుడు.
2. ఈ శరీరము ఎప్పుడు మరణించునా, ఎప్పుడు భుజించుదుమా అని పశుపక్ష్యాదులు వేచివున్నవి. అగ్ని భుజించవలెనని వేచి వున్నది. భూమి నావంతు అనుచున్నది. ఈ శరీరమును అందముగా అలంకరించి ప్రేమించుచున్నాము.
3. అవసరాలు జీవితాంతము ఉంటాయి. వాటిని తీర్చుకోవడం, సాధనా రెండు జరగడం అనేది కల్ల. అవసరాలను పరిత్యజించక తప్పదు.

   శరీరం అనిత్యం, అపవిత్రం అని తెలుసుకోవాలి. మన శరీరాలు ఇతర శరీరాలు కూడా అంతేనని తెలుసుకుంటే దేహం మీద ప్రీతి నశిస్తుంది. ఇతరుల స్త్రీల పట్ల చెడ్డభావాలు నశిస్తాయి.

   గురువుకు కానుకలయందు ప్రీతి ఉండరాదని, పరిగ్రహం చేయరాదని శ్రుతివాక్యం. శిష్యుడు గురువుకు సమిదలు మాత్రమే తీసుకెళ్ళి సమర్పించాలి. తానుఎన్నుకొన్న గురువు శ్రోతియుడు, బ్రహ్మనిష్టుడు అయివుండాలి.

జ్ఞానాన్ని దగ్ధ కర్మణేనమః  కర్మలను ఆచరించుట ద్వారా పొందిన జ్ఞానం, (అనుభవం ద్వారా కర్మలను చక్కగా చేయగలగడం)

1. ఏది చేయడానికి సమాజం అడ్డమెుస్తుందో, మనం జంకుతామో దాన్ని మనసులో చేయడానికే సినిమాలుండేది.
2. ఆధ్యాత్మికంగా బాగుపడాలనుకొనేవాడు ధనాన్ని దూరంగా వుంచాలి. తాను బ్రహ్మము అని నిరంతరము ధ్యానిచక పోతే దేహాభిమానం నశించదు. దేహభావం పోదు.

## శ్రీ భరద్వాజ మాస్టారు గారి గూర్చి

ఆయనప్పుడప్పుడు భద్రాచలం ప్రాంతంలోని అడవులలోకి వెళ్ళి సుమారు 4 రోజులు ఉండేవారట. కూడా గోధుమపిండి తీసుకెళ్ళేవారట. ఒకసారి అక్కడ బావుంటుందని అందుకు మాస్టరుగారు వెళ్తారని భావించి తెలిసిన వారు ఆయన వెంటబడ్డారట. అక్కడ ఉండటం కష్టం అని మాస్టరు ఎంతచెప్పిన వాళ్ళు వినలేదు. వాళ్ళను తీసుకెళ్ళారట. అక్కడకు వెళ్ళేసరికి వర్షం వచ్చింది. గోదావరి నుంచి నీరు తెచ్చి రొట్టె చేసేరట.అది వెంటనే తినకపోయేసరికి చెక్కలాగా గట్టిగా అయిపోయిందట. చివరకు ఇంటికి పోవాలని అడిగారట వాళ్ళు. వారికి అడవి చూపుదామని మాస్టారుగారు అడవిలోకి తీసుకెళ్ళారట. అక్కడొక చోట పక్షులు పెద్దగా అరుస్తున్నాయట. అవి వున్నట్లుండి అరవడం మానేశాయట. అది ఏదో క్రూరజంతువు వచ్చినందుకు గుర్తు. అది మాస్టారు గారికి తెలుసు. అక్కడ చూస్తే పొదలమాటున ఒక పులి పడుకుని పంజానాక్కొంటుంది. అది వీళ్ళను చూడగానే పొదలలోకి ఎగిరి దూకింది. అది ఎంత చక్కగా ఎగిరిందంటే ఒక్క ఆకైనా కదిలిన శబ్దం రాలేదు. అంత నైపుణ్యంగా



దూకింది. అది పొదలో పొంచి వుందో, పారిపోయిందో అర్థంకాలేదు అందరికీ బాగా భయమేసింది. ఆయనతోకూడా వెళ్ళినవారు ఆ రాత్రి నిద్రపోతే ఒట్టు. ఒకరు కాపుగావుంటూ మరొకరు నిద్రించారు. ఆరోజు రాత్రి మాస్టరుగారు ఆలస్యంగా పడుకొని ఉదయం ఆలస్యంగా లేచారు. చూస్తే కూడా వచ్చినవారులేరు. దారితప్పి అడవిలో ఎన్నోమైళ్ళు తిరిగారు. చివరకు కోయదొరలు కనిపించి విచారించి మాస్టరు దగ్గరకు తీసుకువచ్చారు. తరువాత వాళ్ళు మాత్రం ఇళ్ళకు వెళ్ళిపోయారు. కోయదొరలు మాస్టరుగారిని మీరొక్కరే ఇక్కడ ఉండడం దేనికని వాళ్ళ గుడిసెల దగ్గరకు తీసుకెళ్ళి వాటిలో ఒకటి ఖాళీ చేయించి ఎంతకాలమైనా ఉండమని చెప్పి రోజూ పండ్లు రకరకాల ఆహారాలు పెట్టారట. వాళ్ళు వివిధ ఔషదాల మొక్కలు చెప్పారట. గుర్తున్న విషయము వ్రాస్తున్నాను. నీళ్ళలో త్రిభుజాకారపు ఆకులు ఉండే తీగలాంటిది ఒకటి చూపించారు. దాని ఆకులు ప్రవహించే నీళ్ళలో వేస్తే మిగిలిన వాటిలో కొట్టుకుపోక ప్రవాహానికి ఎదురుగాపోతుందని శ్రీ మాస్టరుగారు స్వయంగా చెప్పారు. మరొక రకం ఆకుమొక్క ఆకులు రావి ఆకులలాగా ఉండి ఎండబెట్టి రాత్రి సమయంలో పాలులో వేసి ఉదయం చూస్తే మరలా ఆకుపచ్చగా అప్పుడే కోసిన ఆకులా తయారవుతుందట. ఆపాలు త్రాగితే చాలా రోగాలు, ఆకలి నశించి ఆరోగ్యం చేకూరుతుందట. ఈ విధంగా ఎన్నో రోజులు చేయవచ్చునట.

**3-4-81**

ఈ రోజు మాస్టరుగారు "నాకెట్టి భయాందోళనలు ఉండవు. ఎట్టి పరిస్థితులలోనైనా మనస్సు నిశ్చలంగా వుంటుందని" చెప్తూ మీసాలు మెలిపెట్టారు.

వార్తాలాపంలో "ఓ మానసమా ! నిన్ను నీ మేలుకోసమే బాధపెట్టి నీ కోరికలు తీర్చడంలేదు" అని ప్రకాశనందులు మనస్సును అణిచిపెట్టుకొన్నట్లు వచ్చింది. దానిని గురించి మాస్టరుగారు వివరణ పరిస్థితులు ఎట్లా రావాలో అట్లే వస్తాయి మనం చింతిస్తే చింతే మిగులుతుంది. జీవితంలో ఏదో కావాలని కలలు కంటూవుంటే అవి నెరవేరాల్సిన పనిలేదు. బలహీనతలను జీవితంలో కొనసాగిస్తాంటే అవెన్నటికి ఆగక మన రాబోయే జన్మలనే మార్చివేస్తాయి. బలహీనతల వలన మనకేదీ ఒరిగేదిలేదని తెలుసుకోవాలి. బలహీనతలు ఉన్నంతకాలం సాధనలో ముందుకు పోము. అవి పని చేయడంతో అయా రూపాలలో బాబా ఉన్న విషయం మరుగున పడుతుంది. హాయిగా సుఖాలనే అనుభవించక కొంతసేపు బలహీనతలు, కొంతసేపు సాధన ఎందుకు! జీవితంలో మిగిలిన సమస్యలు (అనారోగ్యం లాంటివి) మారాలి అని సాయిని ప్రార్థిస్తూ దానికి సంబంధించిన బలహీనతలను మాత్రం విడవడం లేదు. బలహీనతలు, జీవితంలోని బాధలు ఒకే స్వప్నం లోనివి. అట్లాంటపుడు బలహీనతలు అట్లాగేవుండి సమస్యలను మార్చటం జరగదు. కలమారితే రెండు మారిపోవాలి. దేహబాధలు, బలహీనతలు లేని స్వప్నం ఆరంభంకావాలి. దీనికోసము వళ్ళు బిగించాలి. ధ్యానం చేసేటప్పుడు అంతా బాబా వున్నారని చూస్తూ వుంటే బలహీనతలు అణిగివుంటాయి. తరువాత బాబా భావం అణిగిపోయి బలహీనతలు తీవ్రతరమౌతాయి. ధ్యానం చేసాక అలసిపోయినట్లు అనిపించి ఇక చాలనిపిస్తుంది. అపుడు జగద్భావం ప్రారంభమయి నెమ్మదిగా మనస్సు బలహీనతలలోకి జారుకుంటుంది. కాబట్టి అపుడు ఆసనాలు, ప్రాణయామం, గ్రంథాలు చదవడంలాంటివి చేయాలి. బలహీనతలకు మనస్సు పూర్తిగా లొంగకముందే జాగ్రత్తపడాలి.



దీనికొక పోలిక చెప్పవచ్చు. జింక చర్మాన్ని రోజూ చుట్టిపెడుతూవుంటే మనం దానిపై కూర్చునేందుకు పరచినపుడు అది చుట్టుకు పోతూవుంటుంది. మనం కమండలాన్ని బరువుగా వుంచి ధ్యానం చేసాక దాన్ని తీస్తే మొట్టమొదట కమండలం దగ్గరనుంచి చుట్టబడటం మొదలై చివరికి కొనపైకి వస్తుంది. జింక చర్మం మనస్సు, కమండలం బాబా అంతటావున్నారన్న భావం. దానం నుంచి లేచి బాబానుం క్రమంగా వెనక్కి చుట్టుకొని చివరకు అవతల అంచు పైకి (బలహీనత) వస్తుంది. ధ్యానం తరువాత బలహీనత చివరిది. ఇట్లా మనస్సు బలహీనతలోకి పోకుండా ఎన్నెన్ని శ్రమలైనా పడాలి. లేకుంటే శంకరులు చెప్పినట్లు 100 జన్మలు గడచినా మనం యిట్లానే వుంటాము. అంతేకాదు యింకా హీనస్థితిలోకి పోతాము. ఇప్పటి బలహీనతల వలన వచ్చే జన్మలో శరీరంలో బలహీనతకు గురైన భాగం అనారోగ్యపడుతుంది. మళ్ళీ బలహీనతలు వాసనరూపంలో ఉండి కొనసాగిస్తుంది.

గృహస్థులైన వారు శరీర ధర్మాన్ని అనుసరించి జీవించాలేగాని రేడియో, నవల, సినిమాలు చూచి కోరికలు తెచ్చుకొని అనుభవించకూడదు. మొదటిది సహజమైనది. రెండవది కృత్రిమమైంది. "జీవితంలో నాకా స్త్రీతోనే వివాహం కావాలి" అనుకుని అయ్యాక ఆమె ముఖం చూడ్డానికే అసహ్యించుకుంటూ ఇంగ్లాండుకు రీసెర్చి సాకుతో వెళ్ళినవాడూ ఉన్నాడు. ఏది ఎట్లా జరగాలో ముందుగానే నిర్ణయం అయివుంటుంది. ఏదైనా సమస్య వస్తే దానికేమి కృషి చేయాలో అది నిర్వర్తించి నిశ్చింతగా ఉండడం అలవరచుకోవాలి.

**10-4-81**

1. ప్రారబ్ధం, ఇచ్ఛ, పరేచ్ఛ అని మూడు రకాలు.
2. మద్యపానము, స్తేయము, గురుపత్నీ గమనము, మహాపాపుల సంసర్గము - మలదోషం - పాపాలు.
3. ధర్మాధర్మాలు తెలుసుకొనేందుకు శాస్త్రాధ్యయనం అవసరం లేకుంటే ధర్మాన్ని అధర్మంగా, అధర్మాన్ని ధర్మంగా భావిస్తుంటాము.

**15-4-81**

1. అవసరాలకు, విలాసాలకు మధ్యగల హద్దును తెలుసుకోవాలి. శరీరానికి అవసరాలను తీర్చక బాధించడం తపస్సుకాదు.
2. ధర్మంగా జీవిస్తూ ఆర్జించిన ధనాన్ని యింద్రియ సుఖాలకు వెచ్చించడం అసురీ సంపత్తి.
3. అక్రమ పద్ధతులలో జీవించడం, అధర్మంగా ఉండటము రాక్షస ప్రవృత్తి.
4. అసుర ప్రవృత్తి, రాక్షస ప్రవృత్తికరమైన గుణాలను పోగొట్టుకొనక నామజపం వలన ఫలితం లేదు. నామజపం వలన వచ్చిన ఫలితాన్ని రాక్షస ప్రవృత్తిలో వృధా అవుతుంది. రావణాదులు చేసిన పని ఇదే.
5. దైవీ సంపత్తి పెంచుకొని చేసిన నామజపం దైవాన్ని పొందటం కోసమే ఉపయోగపడుతుంది.
6. నిరర్ధకరమైన ఆశ, కర్మ, జ్ఞానము మొదలుగునవి రాక్షస, అసుర ప్రవృత్తులను వృద్ధి చేయును.



**26-4-81**

1. తన శాయశక్తులా మానవజాతిని పతనం కాకుండా ప్రతి ఒక్కరు చూడాలి.
2. సన్యాసి చాతుర్మాస్యంలో దేవాలయాలలో, మఠాలలో వుండి అచటి ప్రజలకు మత గ్రంథాల గురించి చెప్పవచ్చు. మిగిలిన కాలంలో 3 రోజులకన్న ఎక్కువ ఒక ఊరిలో వుండకూడదు.

**28-4-81**

1. 'నేను' అన్న అనుభవమే పురుషుడు
2. అసుర ప్రవృత్తిని తొలగించుకోకపోతే రాక్షస ప్రవృత్తికి మారుతుంది మనస్సు.
3. వివేకాన్ని విడిచి ఒక్కక్షణం జీవించకూడదు.
4. మానావమానాలన్నీ పూర్వ పుణ్యం వల్ల వచ్చేవే.
5. మరణం తప్పదని గుర్తుంచుకుంటే శరీరంపైన వ్యామోహం ఉండదు.
6. భోగే రోగభయం.

**29-4-81**

1. జ్ఞానం కోరువారు కోరికలుంచకూడదు. కోరికలుంటే జ్ఞానం రాదు. ఉపాసనీ నానావలీ దెబ్బలు తప్పించమని సాయిని కోరలేదు. పెద్ద ఆపద తీర్చినపుడు సాయిపైన ఉండే భావం ఎప్పుడూ ఉంచుకోవాలి.
2. కోరికలు కలిగినపుడు దానిని గూర్చి యోచించి తొలగించుకోవాలి. అవి పెరిగినపుడు ముక్తిరాదు.

3. ఎవరి సన్నిధిలో మన సమస్యలు మొత్తం మరచిపోయి తృప్తి, శాంతి అనుభవం అవుతుందో అతడు మహాత్ముడు.
4. హింస ద్వారా సంతోషాన్ని పొందాలనుకోవడం (అనిపించడం) తమోగుణం.
5. స్వప్రయోజనం లేకుండా స్వధర్మయుతంగా వుండే భగవత్సేవ అయినదే నిష్కామ కర్మ.
6. సాటి జీవులతో ప్రేమగా జీవించనివాడు సాధనకు పనికిరాడు.
7. డబ్బు మొదలైనవి మనల్ని రక్షించవని గుర్తుంచుకొని అనన్యంగా శరణు పొందితే, మరణసమయంలో మరణబాధ అనుభవం కాక భగవద్దర్శనములో లీనమై భయరహితముగా ప్రాణం విడుస్తాడు.

**10-5-81 వైశాఖ శుద్ధ సప్తమి.**

1. మంచి గుణాలుగాని, చెడ్డ లక్షణాలుగాని మనలో పెరుగుతూగానీ, తగ్గుతూగాని వుంటాయి.
2. దైవ గుణాన్ని పెంచుకుంటూ పోవాలి.
3. అక్రోధము: వెనుక సంఘటనల ఆధారంగా సాటివారిపై క్రోధము వహించకూడదు. ఆలోచించి తొలగించుకోవాలి.
4. ప్రాపంచిక చింతలు లేకుండా అంతఃకరణము చంచలం కాకుండా శాంతిగానుండవలెను.

   అపైశునము: ఇతరుల దోషములు నలుగురికి చెప్పుట.

**12-5-81**

1. జన్మ జన్మలకీ సాధన పూర్తి అయ్యేవరకు వివేకం, వైరాగ్యం నశించవని బౌద్ధంలో బోధిసత్వుడు అంటారు.



2. అధర్మంపట్ల లజ్జ వుంటే సద్గుణాలు మనలో నాటుకుంటాయి.
3. శరీరానికి, మనస్సుకి, ఇంద్రియాలకు ఎప్పుడూ చాపల్యాలు లేనివాడు యతి.

   దుష్టభావాలపై ప్రీతివల్ల వాటిని పొందగలిగే వస్తువులు చూడాలనిపిస్తుంది. పొరపాటున చూచినపుడు వివేకంగా అన్నింటిలో ఉండేదే తనలో ఉందని వివేకంగా చూడాలి.
4. జన్మపరంపరలు సాధన చెడకుండా ఉండాలంటే వ్యర్థంగా మూడవ వ్యక్తి గూర్చి చర్చించడం చేయకూడదు.
5. వ్యర్థప్రసంగము, అనవసరంగా నవ్వడం, త్రోవలో నాలుగు వైపులకు చూస్తూనడవడం చాపల్య లక్షణాలు.

ఇవన్నీ ఆచరించగలగాలంటే మనం ఒకరిని ఆశ్రయించాలి. మనకు ఆశ్రయం ఇవ్వదలచినవారు ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారు ఈ సత్సంగ - ప్రవచనాలా ద్వారా సరియైన జీవిత విధానానికి మార్గం చూపారు. సాయి - మాస్టర్ జీవిత విధానమే ముముక్షువులకు, గురువులకు ఆదర్శ ప్రాయం.

క్షణక్షణం ఆత్మ వికాసానికై కృషి చేయడం
మన జీవితలక్ష్యం కావాలి.

# శిరిడీసాయి సత్సంగం

## చిత్రకూటం, సూళ్ళూరుపేట

### కార్యక్రమములు

ఉదయం 6గం॥ కాకడారతి

మధ్యాహ్నం 12 గం॥ మధ్యాహ్న ఆరతి

సాయంకాలం 6-15 ని॥ ధూప ఆరతి

ప్రతి గురు, ఆదివారములు సాయంత్రం
7-00 గం॥లకు సత్సంగం- భజన

ప్రతిరోజు మధ్యాహ్నం 12 గం॥లకు శిరిడిలోని స్థానిక భక్తులు బాబాకు బిక్ష యివ్వడం ఆనవాయితీగా జరుగుచున్నది. అదే విధంగా ఇచట కూడా మధ్యాహ్నం 12 గం॥లకు మన ఇంటిలో వండిన భోజన పదార్థాన్ని బాబాకు నివేదించడం జరుగుచున్నది. ప్రతిఒక్కరు పాల్గొనగలరు.

## విశేష కార్యక్రమములు

శ్రీరామ నవమి

గురుపూర్ణిమ

విజయదశమి (బాబా సమాధిరోజు)

దత్త జయంతి

ప్రతి పౌర్ణమికి ఉదయం 10 గం॥లకు

భగవద్గీత పారాయణ జరుగును.